

లైబ్రరీ

ప్రతి వార్త సంచలనం



హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 251 సోమవారం 12 అక్టోబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-

చెన్నైలో కొత్త మెట్రోకు పచ్చజెండా..

తొలి ప్రయాణం చేసిన ప్రధాని మోదీ, సీఎం విజయ్

- చెన్నై మెట్రో ఫేజ్ 2లో కీలకమైన పూనమల్లి-వడపళని మార్గం ప్రారంభం
- కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించిన ఇరువురు నేతలు
- సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో 15 కిలోమీటర్ల మేర ఈ మార్గం నిర్మాణం
- పశ్చిమ శివార్ల నుంచి నగర కేంద్రానికి తగ్గనున్న ప్రయాణ సమయం



ఆఫ్రికా తీరంలో పెను విషాదం..

పడవ ప్రమాదంలో 109 మంది మృతి

- ప్రమాదంలో 15 మంది చిన్నారులతో సహా 109 మంది మరణం
- మరో 116 మంది ఆచూకీ గల్లంతు, కొనసాగుతున్న గాలింపు చర్యలు
- జిబౌటి నుంచి యెమెన్‌కు వెళుతుండగా జరిగిన ఘోర దుర్ఘటన
- 80 మందిని అధికారులు కాపాడగా, సహాయక చర్యలు చేపట్టిన ఐఓఎం



డేటా సెంటర్ల ఏర్పాటులో వాటి భద్రత, గోప్యత కీలకం

డేటా రక్షణ, గోప్యతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తెలిపారు. డేటా గోప్యతను కాపాడటం, డిజిటల్ వ్యవస్థలను సురక్షితంగా ఉంచడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.డేటా సెంటర్ల ఏర్పాటులో వాటి భద్రత, గోప్యత కీలక అంశాలని ఆయన వివరించారు. ఆదివారం హైదరాబాద్‌లో బిలియన్స్ ఏఐ సెంటర్‌ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏఐ సాధనాలను ఉపయోగించేట ప్పుడు అవి ఎంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నాయో పరిశీలించాల్సి ఉందన్నారు.

- మిగతా2లో



రాజకీయ లబ్ధి కోసం చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ



ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ఓ మతానికి పరిమితం చేయడం కరెక్ట్ కాదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

- మిగతా2లో

యువత రీల్ లైఫ్ కాదు.. రియల్ లైఫ్‌లో బతకాలి

సిద్దిపేట యువతతో ఆదివారం నిర్వహించిన ఇంటరాక్షన్ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పలు సూచనలు చేశారు. రీల్ లైఫ్ కాదని.. రియల్ లైఫ్‌లో బతకాలని యువతకు మార్గనిర్దేశం చేశారు. వారు ఆన్‌లైన్ గేమ్స్ ఉచ్చులో పడొద్దని.. డ్రగ్స్, వ్యసనాలకు దూరంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు.

- మిగతా2లో



కొత్త పార్టీకి నిధుల సవాల్..

కవిత రాజకీయ ప్రస్థానానికి అసలు పరీక్ష!

తెలంగాణ రాజకీయాల్లో కొత్త పార్టీ ఏర్పాటు చేయడం ఒక ఎత్తయితే దానిని ప్రజల్లోకి తీసుకెళ్లి, సంస్థాగతంగా బలోపేతం చేయడం మరో ఎత్తు. కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని తెలంగాణ రక్షణ సేనకు కూడా ఇప్పుడు ఇలాంటి సవాళ్లే ఎదురవుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. కొత్త పార్టీ మనుగడకు ఆర్థిక వనరులు ఎంత అవసరమో, ప్రజల మద్దతు, బలమైన నాయకత్వం, క్షేత్ర స్థాయి కార్యకర్తల భాగస్వామ్యం కూడా అంతే ముఖ్యం.

- మిగతా2లో



సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా

డిమాండ్‌తో ఢిల్లీలో కొనసాగుతున్న ఆందోళనలు



ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సీజేపీ చేపట్టిన నిరసనలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తతలు దారితీశాయి. ఈ నిరసనలను అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం నక్సల్ ప్రభావిత, సరిహద్దు ప్రాంతాల నుంచి భద్రతా దళాలను ఢిల్లీకి తరలించిందని కాక్రోచ్ జనతా పార్టీ ఆదివారం ఆరోపించింది.

ఢిల్లీలో అనవసర బారికేడ్లు తొలగింపునకు సుప్రీంకోర్టు ఆదేశం

- ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తప్ప మెట్రో, రైలు సేవలు ఆపవద్దని సూచన
- శాంతియుత నిరసనకారులను అక్రమంగా నిర్బంధించరాదని స్పష్టీకరణ
- ఇంటర్నెట్, మెట్రో సేవలు పునరుద్ధరించామని కోర్టుకు తెలిపిన కేంద్రం



రైతు పట్ల అనుచిత వ్యాఖ్యలు.. గజ్వేల్ తహసీల్దార్ పై సస్పెన్షన్ వేటు



- "పురుగుల మందు తాగలేదా?" అంటూ అధికారి చేసిన వ్యాఖ్యల వీడియో వైరల్
- ప్రజాగ్రహం వెల్లువెత్తడంతో విచారణకు ఆదేశించిన కలెక్టర్
- ప్రాథమిక విచారణ నివేదిక ఆధారంగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ

డేటా సెంటర్ల ఏర్పాటులో వాటి భద్రత, గోప్యత కీలకం

అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏఐ సాధనాలను ఉపయోగించేటప్పుడు అవి ఎంత బాధ్యతాయుతంగా పనిచేస్తున్నాయో పరిశీలించాల్సి ఉందన్నారు. ఏఐ వినియోగంలో బాధ్యత, పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. సాంకేతికతను ఉపయోగించుకోవడంతోపాటు దాని ద్వారా ఎదురయ్యే సవాళ్లపైనా దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా ఆయన నొక్కి చెప్పారు. డిజిటల్ భద్రతకు ప్రాధాన్యమిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. సంప్రదాయ విద్యా విధానాలకు సాంకేతికతను జోడించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. విద్యా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక మార్పులు తీసుకొస్తోందని అన్నారు. ఏఐ ఆధారిత పరిష్కారాలు విద్యార్థుల అభ్యాస ప్రక్రియను మరింత మెరుగుపరుస్తాయని ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రాక్టీస్, లెర్నింగ్ కోసం ఎడ్యుకేషన్ టెక్నాలజీని వినియోగించుకోవడం సంతోషకరమని చెప్పారు. నీట్ పేపర్ లీక్ తర్వాత .. డేటా లీక్ అరికట్టాల్సిన అవసరం మరింత పెరిగిందని అన్నారు. ఇంపాక్ట్ -2025 సర్వే ప్రకారం.. ఎడ్యుకేషన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్న పిల్లల్లో 77 శాతం మంది ప్రాక్టీస్, లెర్నింగ్ కోసం వినియోగిస్తున్నారని వివరించారు. విద్యా సంస్థల్లో ఎదురయ్యే సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు అందుబాటులోకి రావాల్సి ఉందని అన్నారు. డిజిటల్ వ్యవస్థల భద్రత, డేటా విశ్లేషణలో ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

యువత రీల్ లైఫ్ కాదు.. రియల్ లైఫ్‌లో బతకాలి

యువత లక్ష్యాన్ని చేరుకోవాలంటే టైమ్ మేనేజ్‌మెంట్ చాలా ముఖ్యమని తెలిపారు. లక్ష్యంపై దృష్టి పెట్టాలని.. అప్పుడే విజయం సాధ్యమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, సిద్దిపేటలో నాణ్యమైన కోచింగ్ వంటి పలు అంశాలపైనా హరీశ్‌రావు మాట్లాడారు.

తెలంగాణ అభివృద్ధిపై..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అభివృద్ధిలో సమూల మార్పునకు కారణమైందని హరీశ్‌రావు తెలిపారు. ఒకప్పుడు ఈ రాష్ట్రానికి నీళ్లు రావన్నవాళ్లే.. ఇప్పుడు కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులు అభివృద్ధికి గుండెకాయలయ్యాయని అంటున్నారని చెప్పారు. తెలంగాణ వచ్చాక పంట దిగుబడులు భారీగా పెరిగాయని వెల్లడించారు. ఒకప్పుడు భూమి, ఆస్తి.. ఇప్పుడు ఆదాయ వనరు అని చెప్పుకొచ్చారు.

మాజీ సీఎం కేసీఆర్ విజనరీ పర్సన్..

మాజీ సీఎం కేసీఆర్ విజనరీ పర్సన్.. ఫైటర్ అని హరీశ్‌రావు అభివర్ణించారు. తెలంగాణ భవిష్యత్తు అద్భుతమని.. దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఉద్ఘాటించారు. పదవుల కోసం ఈ రాష్ట్ర నినాదాన్ని వాడుకోలేదని చెప్పారు. పదవులను త్యాగం చేసి ఉద్యమాన్ని నడిపించారని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర సాధనతో అభివృద్ధికి కొత్త దారులు తెరుచుకున్నాయని వివరించారు.

సిద్దిపేటతో అనుబంధం..

సిద్దిపేట ప్రజలకు ఆజన్మాంతం రుణపడి ఉంటానని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. తాను ఏడుసార్లు పోటీ చేస్తే.. ఆరుసార్లు ప్రత్యర్థులకు డిపాజిట్ రాలేదని చెప్పారు. ఇక్కడి ప్రజలకు ఎదిగిన కొడుకులాంటి వాడిగా ఉంటానని అన్నారు. సిద్దిపేట ప్రేమకు, ఆతిథ్యానికి నిలయమని తెలిపారు. ఒకప్పుడు ఎన్నికల నినాదాలుగా ఉన్న గోదావరి జలాలు, జిల్లా ఏర్పాటు, రైలు కలలను నిజం చేసుకున్నామని వెల్లడించారు.

సిద్దిపేటలోనే నాణ్యమైన కోచింగ్..

హైదరాబాద్‌లో లభించే నాణ్యమైన కోచింగ్‌ను సిద్దిపేట యువతకు ఇక్కడే అందిస్తున్నామని వివరించారు. యువతకు కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా ముఖ్యమని చెప్పారు. స్వతంత్రంగా నిలబడగలిగినప్పుడే జీవిత భాగస్వామిని ఎంచుకోవాలని హరీశ్‌రావు సూచించారు.

కొత్త పార్టీకి నిధుల సవాల్.. కవిత రాజకీయ ప్రస్థానానికి అసలు పరీక్ష!

ఒక రాజకీయ పార్టీని నడపడానికి కార్యాలయాల నిర్వహణ నుంచి కార్యకర్తల సమన్వయం వరకు అనేక ఖర్చులు ఉంటాయి. గ్రామాలు, పట్టణాల్లో సమావేశాలు నిర్వహించడం, ప్రజా సమస్యలపై కార్యక్రమాలు చేపట్టడం, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి కార్యకలాపాలకు నిరంతర నిధుల అవసరం ఉంటుంది. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఈ అవసరాలు మరింత పెరుగుతాయి. ఈ నేపథ్యంలో కొత్త పార్టీకి ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం కీలక అంశంగా మారుతుంది.

నాయకత్వం ఒక్కటే సరిపోదు!

తెలంగాణ రక్షణ సేనకు కవిత నాయకత్వం ఉన్నప్పటికీ, పార్టీ విస్తరణకు అవసరమైన ఆర్థిక వనరులు, బలమైన నాయకుల చేరిక, క్షేత్రస్థాయి నిర్మాణం వంటి అంశాలు ఎంతవరకు బలపడతాయన్నది ప్రధాన ప్రశ్న. ఆర్థికంగా బలమైన నాయకులు కొత్త పార్టీలో చేరడం లేదన్న చర్చలు వినిపిస్తున్నప్పటికీ, పార్టీ వాస్తవ ఆర్థిక పరిస్థితిపై అధికారిక వివరాలు అందుబాటులో లేకుండా తుది నిర్ణయానికి రావడం సరికాదు. అయితే, ఒక విషయం స్పష్టం. రాజకీయాల్లో వ్యక్తిగత గుర్తింపు పార్టీ బలోపేతానికి ఉపయోగపడవచ్చు. కానీ ఆ గుర్తింపును శాశ్వత రాజకీయ శక్తిగా మార్చాలంటే నిరంతర ప్రజా సంబంధాలు, స్థానిక నాయకత్వం, స్పష్టమైన విధానాలు అవసరం. నిధులు ఉన్నంత మాత్రాన పార్టీ విజయవంతం కాదు. అదే సమయంలో ఆర్థిక వనరులు లేకుండా దీర్ఘకాలం కార్యకలాపాలు కొనసాగించడం కూడా సులభం కాదు.

తెలంగాణ జాగృతి అనుభవం నుంచి పాఠాలున్నాయా?

కవిత గతంలో తెలంగాణ జాగృతి ద్వారా సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఆ అనుభవం కొత్త పార్టీకి ఉపయోగపడే అవకాశం ఉంది. అయితే ఒక సంస్థను నిర్వహించడం, రాజకీయ పార్టీని నిర్మించడం రెండూ వేర్వేరు బాధ్యతలు. రాజకీయ పార్టీకి ప్రజా సమస్యలపై నిరంతర స్పందనతో పాటు, గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సమర్థమైన వ్యవస్థ అవసరం. గత అనుభవాలను రాజకీయ బలంగా మార్చుకోవాలంటే పాత పరిచయాలు మాత్రమే సరిపోవు. యువత, మహిళలు, కార్మికులు, రైతులు, నిరుద్యోగులు వంటి వర్గాల్లో నమ్మకాన్ని సంపాదించాలి. వారి సమస్యలకు పరిష్కారాలు చూపుతూ, క్రమం తప్పకుండా ప్రజల్లో ఉండాలి. పార్టీకి ఆర్థికంగా సహకరించే వ్యవస్థను కూడా పారదర్శకంగా నిర్మించుకోవాలి.

నిధుల సమీకరణలో పారదర్శకత కీలకం

రాజకీయ పార్టీలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? వాటిని ఏ విధంగా ఖర్చు చేస్తున్నారు? అనే అంశాలు ప్రజాస్వామ్యంలో ప్రాధాన్యం కలిగినవి. కొత్త పార్టీలు ప్రజల నుంచి విరాళాలు సేకరించడం, సభ్యత్వ వ్యవస్థను బలోపేతం చేయడం, చట్టబద్ధమైన మార్గాల్లో నిధులు సమకూర్చుకోవడం వంటి పద్ధతులపై దృష్టి పెట్టవచ్చు. అయితే, ఏ పద్ధతిని అనుసరించినా నిబంధనలకు అనుగుణంగా ఉండటం, ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పాటించడం అవసరం. నిధుల కొరతపై చర్చలు రావడం ఒక అంశమైతే, పార్టీ వాస్తవ పరిస్థితిని నిర్ధారించే ఆధారాలు ఉండటం మరో అంశం. రాజకీయ విమర్శలు, ఊహాగానాలను వాస్తవాలుగా ప్రచారం చేయకుండా, అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలించడం మీడియా బాధ్యత.

ప్రజల సమస్యలే అసలైన పెట్టుబడి!

కొత్త పార్టీకి చివరికి ప్రజల విశ్వాసమే ప్రధాన పెట్టుబడి. నిరుద్యోగం, రైతుల సమస్యలు, విద్య, వైద్యం, మహిళల భద్రత, తెలంగాణ వనరుల వినియోగం వంటి అంశాలపై పార్టీ స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలి. కేవలం విమర్శలకు పరిమితం కాకుండా, సమస్యల పరిష్కారానికి అమలు చేయగల ప్రతిపాదనలను ప్రజల ముందుంచాలి. పార్టీ నిర్మాణంలో ఆర్థిక వనరులు, నాయకుల బలం, కార్యకర్తల భాగస్వామ్యం, ప్రజల మద్దతు.. ఈ నాలుగు అంశాల మధ్య సమతుల్యత అవసరం. వీటిలో ఏ ఒక్కటి బలహీనంగా ఉన్నా పార్టీ విస్తరణపై ప్రభావం పడవచ్చు. కవిత ముందున్న సవాలు కేవలం నిధులను సమకూర్చుకోవడం మాత్రమే కాదు. తన రాజకీయ లక్ష్యాలను ప్రజలకు స్పష్టంగా వివరించడం, నమ్మకమైన నాయకత్వాన్ని నిర్మించడం, క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేసే వ్యవస్థను ఏర్పాటు చేయడం కూడా అంతే ముఖ్యం. తెలంగాణ రక్షణ సేన ఈ సవాళ్లను ఎలా ఎదుర్కొంటుంది? ప్రజల నుంచి ఎంత మద్దతు పొందుతుంది? తన రాజకీయ కార్యాచరణను ఎంత సమర్థంగా అమలు చేస్తుంది? అన్న అంశాలే ఆ పార్టీ భవిష్యత్ ప్రస్థానాన్ని నిర్ణయిస్తాయి.

ఢిల్లీలో అనవసర బారికేడ్ల తొలగింపునకు సుప్రీంకోర్టు ఆదేశం

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ సమస్యలు ఉంటే తప్ప, మిగతా అన్ని చోట్లా ఏర్పాటు చేసిన బారికేడ్లను సమీక్షించి తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో, రైల్వే సేవలను యథాతథంగా కొనసాగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప వాటిని నిలిపివేయరాదని నేడు జరిగిన ప్రత్యేక విచారణలో స్పష్టం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన డిమాండ్లతో నిన్న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా అధికారులు భారీ ఆంక్షలు విధించారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం, నిరసనకారులను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణల పై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ప్రజలు, వాహనాల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం కాకుండా ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించరాదని తేల్చి చెప్పింది.నిర్దిష్ట ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన చోట మినహా, శాంతి యుతంగా సమావేశమయ్యే వారిని అక్రమంగా నిర్బంధించకూడదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలను ఇప్పటికే పునరుద్ధరించామని, మెట్రో కార్యకలాపాలు కూడా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చాయని కోర్టుకు తెలియజేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మెట్రో స్టేషన్ల మూసివేత పై వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని దీనిపై మరిన్ని వివరాలు సమర్పించాలని కోరుతూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

చెన్నైలో కొత్త మెట్రోకు పచ్చజెండా.. తొలి ప్రయాణం చేసిన ప్రధాని మోదీ, సీఎం విజయ్

చెన్నై మహానగరంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. చెన్నై మెట్రో రైల్ ఫేజ్ 2లో భాగంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పూనమల్లి-వడపళని మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేడు కలిసి ప్రారంభించారు. పోరూర్ బైపాస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరువురు నేతలు జెండా ఊపి తొలి రైలు సర్వీసును ప్రారంభించారు. అనంతరం కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించి, అందులోని సౌకర్యాలను పరిశీలించారు. కారిడార్ 4లో భాగంగా సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో ఈ కొత్త మార్గాన్ని నిర్మించారు. 15 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో మొత్తం 11 ఎలివేటెడ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులో అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. ముఖ్యంగా, కొన్నిచోట్ల డబుల్ డెక్కర్ సెక్షన్‌ను నిర్మించడం ఈ మార్గం ప్రత్యేకత. అంతేకాకుండా భవిష్యత్తులో డ్రైవర్ అవసరం లేకుండానే రైళ్లను నడిపేందుకు వీలుగా ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇది రైళ్ల రాకపోకలలో కచ్చితత్వాన్ని, భద్రతను పెంచుతుంది. ఈ కొత్త మెట్రో కారిడార్ అందుబాటులోకి రావడంతో చెన్నై పశ్చిమ శివారు ప్రాంతాలైన పూనమల్లి వంటి ఏరియాల నుంచి వడపళని వంటి నగర కేంద్ర ప్రాంతాలకు ప్రయాణం సులభతరం కానుంది. ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసిన వెంటనే ఈ మార్గంలో ప్రయాణికుల కోసం సాధారణ సర్వీసులను కూడా ప్రారంభించారు. ఈ కొత్త మెట్రో లైన్ చెన్నై నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

రాజకీయ లబ్ధి కోసం చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ఓ మతానికి పరిమితం చేయడం కరెక్ట్ కాదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి స్పష్టం చేశారు. చరిత్రని వక్రీకరించి ఛత్రపతి శివాజీని రాజకీయ లబ్ధి కోసం బీజేపీ వాడుకుంటుందంటూ మండిపడ్డారు. ఆదివారం సంగారెడ్డి బైపాస్ రోడ్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహా ఏర్పాటుకు ఆయన భూమి పూజ చేశారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ వద్ద ముస్లిం అధికారులు కూడా పని చేశారని గుర్తు చేశారు. ఆయనకు కులం, మతంతో సంబంధం లేదని అన్నారు. రాజ్యంలోని ప్రజల బాగోగులు, రాజ్య భద్రతే శివాజీకి ముఖ్యమని స్పష్టం చేశారు. ఛత్రపతి గొప్ప వీరుడని.. ఆయన గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా యువతకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో ఢిల్లీలో కొనసాగుతున్న ఆందోళనలు

ఢిల్లీని ఓ కంటోన్మెంట్‌గా మార్చేశారని తీవ్రంగా విమర్శించింది. నివారణ అరెస్టు తర్వాత కోర్టు నుంచి విడుదలైన సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ మీడియాతో మాట్లాడారు. "ఒక్క వ్యక్తిని కాపాడేందుకు దేశంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారు.జ్ఞానేశ్ కుమార్‌ను ఎందుకు కాపాడుతున్నారు? 2024 ఎన్నికలకు సంబంధించి లేదా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగిన తీరుపై ఆయనకు ఏమైనా రహస్యాలు తెలుసా?" అని సౌరవ్ దాస్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. సీఈసీ రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని, ఈ నిరసనల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు."గత కొన్ని రోజులుగా ఢిల్లీ నగరాన్ని మొత్తం ఓ కంటోన్మెంట్‌గా మార్చేశారు. నిరసనలను అడ్డుకునేందుకు నక్సల్ ప్రాంతాలు, బెంగాల్, కశ్మీర్ నుంచి ప్రత్యేక దళాలను, సరిహద్దుల నుంచి బీఎస్ఎఫ్ సిబ్బందిని విమానాల్లో తరలించారు. దాదాపు 30,000 నుంచి 40,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు" అని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సౌరవ్ దాస్ అన్నారు. "ఆందోళన కారుల పై ప్రజల్లో వ్యతిరేకత సృష్టించేందుకే ప్రభుత్వం ఇలా చేస్తోంది. మెట్రో స్టేషన్లు మూసివేయడం, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే రైళ్లను నిలిపివేయడం, దుకాణాలను బలవంతంగా మూయించడం వంటి చర్యలతో సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారు. కానీ, ప్రభుత్వం పొరబడుతోంది. యువతపై జరుగుతున్న ఈ దౌర్జన్యాన్ని దేశమంతా గమనిస్తోంది" అని పేర్కొన్నారు. తమను అరెస్టు చేసే సమయంలో ఢిల్లీ పోలీసులు ఎలాంటి అధికారిక నోటీసులు ఇవ్వలేదని, ఫోన్లను స్వాధీనం చేసుకుని,సాక్ష్యాలను తారుమారు చేసేందుకు హ్యాక్ చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, ఢిల్లీలో మెట్రో, రైల్వే సేవలను సాధారణ స్థితికి తీసుకురావాలని, ఇంటర్నెట్ కనెక్టివిటీకి అంతరాయం కలిగించవద్దని సుప్రీంకోర్టు అధికారులను ఆదేశించడాన్ని సీజేపీ న్యాయ వ్యవహారాల అధిపతి రత్న సింగ్ స్వాగతించారు. అయితే, కోర్టు ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతాయో చూడాలని ఆమె అన్నారు.

రైతు పట్ల అనుచిత వ్యాఖ్యలు.. గజ్వేల్ తహసీల్దార్ పై సస్పెన్షన్ వేటు

సిద్దిపేట జిల్లాలో ఓ రైతు పట్ల అమానవీయంగా, అనుచితంగా వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. భూ వివాదం విషయమై తనను కలిసేందుకు వచ్చిన రైతును కించపరిచేలా మాట్లాడాడంటూ గజ్వేల్ తహసీల్దార్ చిట్టంపల్లి స్వామిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వివరాల్లోకి వెళితే.. గజ్వేల్ మండలం మక్తమాసన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు యేసు, రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) భూ సేకరణ పరిహారం విషయంలో తన బంధువులతో ఉన్న వివాదంపై మాట్లాడేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌తో కలిసి ఆయన తహసీల్దార్ స్వామిని కలిశారు. రైతు తన సమస్యను వివరిస్తుండగా, అధికారి స్పందించిన తీరు తీవ్ర వివాదాస్పదమైంది. "ఇంకా బతికే ఉన్నావా? పురుగుల మందు తాగలేదా?" అంటూ తహసీల్దార్ రైతును ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అలా అన్నారా అని ప్రశ్నించగా.. "అవును, ఉద్దేశపూర్వకంగానే అన్నాను" అని అధికారి బదులివ్వడం వీడియోలో స్పష్టంగా రికార్డయింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తహసీల్దార్ తీరుపై తీవ్ర ప్రజా వ్యతిరేకత వ్యక్తమైంది. రైతుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) ప్రాథమిక విచారణ జరిపి, తహసీల్దార్ ప్రవర్తన సరికాదని నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా కలెక్టర్.. తహసీల్దార్ స్వామిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముందస్తు అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఆఫ్రికా తీరంలో పెను విషాదం.. పడవ ప్రమాదంలో 109 మంది మృతి

ఆఫ్రికా తీరంలో పెను విషాదం చోటుచేసుకుంది. మెరుగైన భవిష్యత్తు కోసం వలస వెళుతున్న వారి జీవితాలు సముద్రంలో కలిసిపోయాయి. సుమారు 350 మందితో ప్రయాణిస్తున్న ఒక పడవ బోల్తా పడిన ఘటనలో 109 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 15 మంది చిన్నారులు కూడా ఉన్నారు. మరో 116 మందికి పైగా గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అంతర్జాతీయ వలసల సంస్థ ఆదివారం ప్రకటించింది. వివరాల్లోకి వెళితే, అక్టోబర్ 8-9 మధ్య రాత్రి సమయంలో జిబౌటి నుంచి యెమెన్‌కు వలసదారులతో ఈ పడవ బయలుదేరింది. జిబౌటిలోని ఒబాక్ పోర్ట్ పట్టణానికి ఉత్తరాన ఉన్న గుహేరే సమీపంలోకి రాగానే పడవ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 109 మృతదేహాలను వెలికితీశారు. ప్రమాదం నుంచి 80 మందికి పైగా ప్రాణాలతో బయటపడగా, వారందరూ ఇథియోపియా జాతీయులని ఐఓఎం తెలిపింది.

సంపాదకీయం

డేటా సెంటర్లకు తాగు నీరు.. ఒక దుష్ప్రచారమే!



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రేపు పాయకరావుపేట వద్ద జరుగనున్న 'జలహారతి' కార్యక్రమం ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు విడుదల కాబోతున్నాయి. ఒకవైపు ఇలా పోలవరం కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్ర ముఖద్వారాన్ని తాకుతుంటే, మరోవైపు ఈ నీటి వినియోగంపై దుష్ప్రచారం పెచ్చుమీరుతున్నది. విశాఖపట్నం నగరవాసులకు దక్కాల్సిన మంచినీటిని ఈ డేటా సెంటర్లు తోడేస్తాయన్నది ఈ ప్రచారం సారాంశం.కానీ, శాసనసభలో ఐటీ మంత్రి లోకేశ్ ఇచ్చిన అధికారిక సమాచారం, క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ డేటాను పరిశీలిస్తే, ఈ ఆరోపణలన్నీ అవగాహనా రాహిత్యంతో చేస్తున్నవేనని తెలుస్తుంది. విశాఖపట్నం ప్రజల మున్సిపల్ తాగునీటి సరఫరా వ్యవస్థకు, గూగుల్ డేటా సెంటర్లకు వాడే నీటి వ్యవస్థకు సాంకేతికంగా కానీ, భౌతికంగా కానీ ఎటువంటి సంబంధమూ లేదు. విశాఖపట్నం ప్రజల కోసం కేటాయించిన ఒక్క నీటి చుక్కను కూడా ప్రభుత్వం పరిశ్రమలకు మళ్లించదని మంత్రి లోకేశ్ స్పష్టంగా చెప్పారు.పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా విశాఖ--అనకాపల్లి ప్రాంతానికి అందుబాటులోకి వచ్చే మొత్తం 23.44 టీఎంసీల నీటిలో ప్రభుత్వం స్పష్టమైన విభజనను అమలు చేస్తోంది. గ్రేటర్ విశాఖపట్నం, పరిసర పట్టణాల్లోని ఇళ్లకు వాడే మంచినీటి కోసం 12 టీఎంసీలు కేటాయించారు. ఈ కోటాను పరిశ్రమలకు మళ్లించడం అసాధ్యం. గూగుల్, అదానీ ఏఐ డేటా సెంటర్ల పూర్తి స్థాయి వినియోగానికి కావలసిన 3.5 టీఎంసీలతో కలుపుకుని, పారిశ్రామిక కారిడార్ అవసరాలకు మొత్తం 4 టీఎంసీలు కేటాయించారు. ఇక అనకాపల్లి, విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు 7.44 టీఎంసీలు కేటాయించారు. ప్రతి ఏడాది సముద్రంలో వృథాగా కలిసే 3,000 టీఎంసీల గోదావరి జలాల నుంచే ఈ కేటాయింపులు జరుగుతున్నాయి తప్ప, రైతుల కోసమో, నగరవాసుల కోసమో కేటాయించిన నీటిని ప్రభుత్వం తీసుకోవడం లేదు.గూగుల్, అదానీ డేటా సెంటర్ల కోసం నిర్మించే నీటి లైన్లు మిగతా వాటితో పూర్తిగా సంబంధం లేకుండా ఉంటాయి. నగరంలో ఇళ్ళకు నీటిని సరఫరా చేసే మున్సిపల్ పైప్‌లైన్లకు, గ్రేటర్ జీవీఎంసీ నిర్వహించే తాగునీటి రిజర్వాయర్లకు ఈ పారిశ్రామిక పైప్‌లైన్లతో ఎలాంటి కనెక్షన్ ఉండదు. కాబట్టి డేటా సెంటర్లు ఎంత నీటిని వినియోగించినా అది నగరవాసుల తాగునీటి సరఫరాపై ఎటువంటి ప్రభావాన్నీ చూపించదు.పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఈ ప్రాంతానికి నీటిని తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో సుమారు రూ.1,050కోట్లు ఖర్చు చేసి, కాలువ నిర్మాణంలో ఉన్న అనేక అడ్డంకులను తొలగించింది. 181.99కి.మీ పొడవైన ఈ ఎడమ ప్రధాన కాలువలో మట్టి తవ్వకం పనులు దాదాపు పూర్తయ్యాయి. కాలువ ద్వారా ఇప్పటికే తూర్పు గోదావరి, పిఠాపురం పరిసర ప్రాంతాలకు నీరు ప్రవహిస్తోంది. అనకాపల్లి వద్దకు చేరుకొనే ఈ జలాల నుంచే ఒకవైపు వ్యవసాయ భూములకు సాగునీరు, మరోవైపు పరిశ్రమలకు ప్రత్యేక పైప్‌లైన్ల ద్వారా నీటి తరలింపు జరుగుతుంది.ప్రభుత్వం గూగుల్ వంటి పారిశ్రామిక దిగ్గజాలకు ప్రజాధనంతో ఉచితంగా నీటి మౌలిక వసతులను కల్పిస్తోందనే ఆరోపణ పూర్తిగా వాస్తవదూరం. పోలవరం ప్రధాన ప్రాజెక్టు మౌలిక వసతులను ప్రభుత్వం పూర్తి చేస్తున్నప్పటికీ, ఈ కాలువ నుంచి తార్లవాడ, అదవివరం, రాంబిల్లి వంటి డేటా సెంటర్ కారిడార్ క్యాంపస్‌లకు నీటిని తీసుకెళ్లే బల్క్ ఇన్--టేక్, ప్రాజెక్టు అంతర్గత మౌలిక సదుపాయాల వ్యయాన్ని రాష్ట్ర పారిశ్రామిక కేటాయింపుల విధానాలకు, ఆయా సంస్థలతో చేసుకున్న ఒప్పంద నిబంధనలకు అనుగుణంగానే చేపడుతున్నారు. దీని ద్వారా సాధారణ పన్ను చెల్లింపుదారులపైన గానీ, నగర మున్సిపల్ నిధులపైన గానీ ఎలాంటి అనవసర భారమూ పడదు. ఇక డేటా సెంటర్లు నీటిని తాగేస్తాయన్న ప్రచారం కూడా నిజం కాదు. ఐటీ, పర్యావరణ నిబంధనల ప్రకారం, గూగుల్ వంటి సంస్థలు అత్యంత అధునాతన సాంకేతికతలను ఉపయోగిస్తున్నాయి. వారు వాడే క్లోజ్డ్--లూప్ ఎయిర్--కూలింగ్ టెక్నాలజీల వల్ల ఇతర భారీ పరిశ్రమలతో పోలిస్తే నీటి వాడకం అత్యంత తక్కువ. విశాఖపట్నం ఐటీ కారిడార్ దాని గరిష్ఠ సామర్థ్యమైన 6.5 గిగావాట్లకు చేరుకున్నప్పుడు మాత్రమే డేటా సెంటర్లకు ఏటా 3.0 నుంచి 3.5 టీఎంసీల నీరు అవసరమవుతుంది. ఏటా గోదావరి నుంచి సముద్రంలో వృథాగా కలిసే 3 వేల టీఎంసీల జలాలతో పోలిస్తే ఇది కేవలం 0.1శాతం మాత్రమే.డేటా సెంటర్ల నిర్మాణంలోని ప్రస్తుత దశలో అతి తక్కువ నీరు సరిపోతుంది. 2028--29 నాటికి ఫేజ్ 1 ప్రారంభ సమయానికి సర్వర్ల కమిషనింగ్ మొదలైనప్పుడే అసలు నీటి వాడకం ప్రారంభమవుతుంది. అంటే, నగరానికి శాశ్వత తాగునీటి పైప్‌లైన్లు పూర్తయిన తర్వాతే డేటా సెంటర్ల వాడకం క్రమంగా పెరుగుతుంది.మరోపక్క గూగుల్ సంస్థ కూడా 2030 నాటికి వాటర్ పాజిటివ్ కావాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

సుప్రీంకోర్టు సీరియస్‌గా ఉంటేనే!



ఏది నిజం? ఏది అబద్ధం! అని ఎవరు చెప్పాలి? ఎవరి మాటలు నమ్మాలి? ఇంత పెద్ద దేశంలో ఏది సత్యమో? ఏది అసత్యమో? చెప్పగలిగే వ్యవస్థే లేదా? ప్రజలలో విశ్వాసం నింపగలిగే వ్యవస్థ ఒక్కటి కూడా మిగలలేదా? ప్రభుత్వాలకు భయపడుతూనో లేక ప్రభుత్వాలను తిట్టుకుంటూనో బతికేయాలా? ఓటర్ల జాబితా నిశిత పరిశీలన పేరిట ఓట్ల చోరీ జరుగుతోందన్న ప్రతిపక్షాల ఆరోపణల్లో వాస్తవం ఉందా? ఈ అంశంపై ప్రభుత్వంగానీ, ఎన్నికల కమిషన్‌గానీ ఎందుకు నోరు మెదపడం లేదు? ఆందోళనలతో దేశ రాజధాని అట్టుడుకుతున్నప్పటికీ న్యాయ వ్యవస్థ సైతం ఎందుకు మౌనంగా ఉంటోంది? ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రాథమిక హక్కు అయిన ఓటును చోరీ చేస్తున్నారని ఆరోపిస్తున్నప్పుడు అందులో నిజం ఉందో లేదో చెప్పాల్సిన బాధ్యత సంబంధిత వ్యవస్థలకు లేదా? దేశ ప్రజలను వేధిస్తున్న ప్రశ్నలు ఇవి! ఎస్ఐఆర్ విషయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు వివాదం ఎందుకు ఏర్పడింది? అన్న ప్రశ్నకు కూడా సమాధానం లభించడం లేదు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో అటు ప్రతిపక్ష పార్టీలు, ఇటు కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమాలు చేస్తున్నప్పటికీ ఎన్నికల కమిషన్ బెల్లం కొట్టిన రాయిలా ఉండిపోవడం ఏమిటి? తాము ఆదేశాలు ఇవ్వకపోయినా ఫాం--6లో మార్పులు చేశారని స్వయంగా సుప్రీంకోర్టు చెబుతున్నప్పటికీ... ఆ విషయమై దేశ ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌కు లేదా? దేశంలో ఓట్ చోరీ జరుగుతోందని ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చాలా కాలంగా ఆరోపిస్తున్నారు. అయితే, ఎస్ఐఆర్ విషయంలో ఎన్నికల కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు చోటుచేసుకున్నాయని ఒక ఆంగ్ల పత్రిక వార్త ప్రచురించే వరకు ఓటు చోరీ అంశాన్ని ప్రజలు సీరియస్‌గా తీసుకోలేదు. ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వాలు ఏర్పడుతూనే ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ ఎన్నిక సందర్భంగా ఈ ప్రక్రియపై చర్చ తీవ్రంగా వచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టును ఆశ్రయించి స్వయంగా కోర్టులో వాదించారు. అయితే ఓటర్లను అక్రమంగా తొలగిస్తున్నారన్న ఆధారాలు ఉంటే మళ్లీ తమను ఆశ్రయించవచ్చునని పేర్కొంటూ సుప్రీంకోర్టు ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లో తొలగించిన ఓటర్లను ఎన్నికల తర్వాత మళ్లీ జోడించినట్టుగా వార్తలు వచ్చాయి. దీంతో ప్రతిపక్షాల ఆరోపణలకు బలం చేకూరినట్టయింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. ప్రతిపక్షాలతో కాక్రోచ్ జనతా పార్టీ కూడా స్వరం కలిపింది. ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టుగా జ్ఞానేశ్ కుమార్ అనే ఒక్క వ్యక్తి అనుకుంటే 13 కోట్ల మంది ఓటర్లను జాబితాల నుంచి తొలగించగలరా? ఇంత పెద్ద దేశంలో, ఎన్నికల కమిషన్ అజమాయిషీలో లక్షలాది మంది ఉద్యోగులు పనిచేస్తారు. జ్ఞానేశ్ కుమార్ కోరుకున్నంత మాత్రాన వాళ్లందరూ తప్పుడు పనులు చేయడానికి సిద్ధపడతారా?సందట్లో సడేమియా అన్నట్టుగా 2024లో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో కూడా ఫలితాలు తారుమారు అయ్యాయని కొందరు ఆరోపించడం మొదలెట్టారు. ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా ఎన్నికల ఫలితాలు ఉంటే ప్రజల్లో అశాంతి ఏర్పడదా? 'దున్నపోతు ఈనింది అంటే దూడను కట్టేయమను' అన్న చందంగా కొంత మంది స్వరం కలిపారు. ఆంధ్రప్రదేశ్ విషయమే తీసుకుందాం! ఆ రాష్ట్రంలో కూడా ఎన్నికల విధుల్లో లక్షలాది మంది ఉద్యోగులు పాల్గొన్నారు. వారిలో తెలుగుదేశం పార్టీ అభిమానులతో పాటు వైసీపీ అభిమానులు కూడా ఉంటారు కదా? ఉన్న ఓట్ల సంఖ్య కంటే అధికంగా ఓట్లు పోలైనట్టుగా రికార్డులు సృష్టించినా, ఈవీఎంలలో మార్పులు చేసినా వైసీపీ అభిమానులు ఊరుకుంటారా? ఎన్నికల సందర్భంగా రిగ్గింగ్ చేయడం, దొంగ ఓట్లు వేయడం మనకు తెలిసిందే. ఇప్పుడు సరికొత్త అంశాలు తెర మీదకు వస్తున్నాయి. పోలింగ్ కేంద్రాలలో మొత్తం ఓట్లు ఎన్ని? పోలైన ఓట్లు ఎన్ని? అన్నది సరిచూసుకొని ప్రిసైడింగ్ అధికారి సంతకం చేస్తారు. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగినప్పుడు ఓట్ల రిగ్గింగ్ జరిగిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈవీఎంల వాడకం మొదలయ్యాక రిగ్గింగ్ ఆరోపణలు తెరమరుగయ్యాయి. అయితే ఓడిన పార్టీలు ఫలితాలు వెలువడిన తర్వాత ఈవీఎంల గోల్‌మాల్ జరిగిందని కొద్ది రోజులు ఆరోపించి, ఆనక మౌనంగా ఉండిపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఎన్నికలు జరిగి రెండున్నరేళ్లు పూర్తవుతున్న వేళ ప్రజా తీర్పును తారుమారు చేశారన్న వాదనలు మొదలయ్యాయి. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి సహా ఆయనకు మద్దతు ఇస్తున్న వారందరూ ఈ వాదనలను నమ్ముతున్నారు. జగన్‌రెడ్డి పాలనను ప్రజలు తిరస్కరించారన్న వాస్తవాన్ని అంగీకరించలేకపోతున్నారు. బటన్లు నొక్కడం ద్వారా జగన్‌రెడ్డి అద్భుతమైన పాలన అందించారని ఇలాంటి వారంతా బలంగా నమ్ముతున్నారు. ఈ క్రమంలో గత ఎన్నికల్లో జగన్‌రెడ్డి ఓడిపోలేదనేదాకా ప్రచారం చేస్తున్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానుల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి రాజకీయ పార్టీలు ఏవేవో చెబుతుంటాయి. నిజానికి వారు కూడా తమ వాదనలను సీరియస్‌గా తీసుకోరు. అయితే మేధావులు, తటస్థ వాదులమని చెప్పుకొనేవారు కూడా ఈవీఎంల గోల్‌మాల్ జరిగిందని మాట్లాడటం ఆశ్చర్యంగా ఉంది. 2019 ఎన్నికల తర్వాత ఓటమి నెపాన్ని ఈవీఎంలపై వేయడానికి చంద్రబాబు ప్రయత్నించినప్పుడు ఎగతాళి చేసినవాళ్లు కూడా ఇప్పుడు ఈవీఎంలను నిందించే ప్రయత్నం చేయడం హాస్యాస్పదంగా ఉంది. 'ఎన్నికల్లో మేమే గెలిచాం లేదా ఫలానా వాళ్లు గెలిచారు. గెలిచినవాళ్లే పరాజితులు' అని చెప్పుకోవడం వల్ల ఆత్మానందం లభిస్తే లభించవచ్చునుగానీ సామాన్య ప్రజలకు వ్యవస్థల పట్ల నమ్మకం పోతుందన్న వాస్తవాన్ని మేధావులుగా చలామణి అవుతున్న వాళ్లు ఆలోచించాలి కదా!జాతీయ స్థాయిలో ఓట్ చోరీ జరుగుతోందన్న ఆరోపణల విషయానికి వద్దాం! ఇందులో ఎంత నిజం ఉంది? ఎన్నికల కమిషనే ఈ అక్రమానికి పాల్పడుతోందా? లేక రాజకీయ పార్టీలు ఆ పని చేస్తున్నాయా? అన్నది తేలాల్సి ఉంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ పని చేయిస్తున్నారన్నది ప్రతిపక్షాల తాజా ఆరోపణ. ఓట్ల చోరీ ద్వారా భారతీయ జనతా పార్టీ వరుస విజయాలు సాధిస్తోందన్న ఆరోపణలే నిజమైతే 2024లో బీజేపీ సొంతంగా మెజారిటీ సీట్లు సాధించలేకపోవడం ఏమిటి? ఎన్నికల ప్రచారం సందర్భంగా చెప్పుకున్నట్టుగా సొంతంగా 400 సీట్లు గెలవడానికి ఎవరు అడ్డొస్తారు? ఇలాంటి సందేహాల నడుమ ప్రతిపక్షాల ఆరోపణల్లో పస లేదేమోనన్న సందేహం కలుగుతోంది. అయితే, ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా అక్రమ వలసదారులు, డూప్లికేట్ ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తారు. మన దేశంలో పలువురికి ఒకచోటికంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు ఉంటోంది. హైదరాబాద్ విషయమే తీసుకుందాం! తెలంగాణలోని పలు జిల్లాలకు చెందిన వారితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు కూడా హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. వారిలో అత్యధికులకు తమ స్వస్థలాలతో పాటు హైదరాబాద్‌లో కూడా ఓటు హక్కు ఉంటోంది. ఎస్ఐఆర్ వల్ల ఇలాంటి వారి ఓట్లు తొలగిపోతాయి. జరగాల్సింది ఇదే! అయితే రాజకీయ పార్టీల కుయుక్తుల వల్ల ఓట్ల తొలగింపు జరుగుతున్నట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక వర్గం వారి ఓట్ల తొలగింపుపై భారతీయ జనతా పార్టీ దృష్టి పెట్టిందని ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పాత్ర ఏమిటి? అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒక్కరే దేశవ్యాప్తంగా ఓట్లు తొలగించలేరు కదా? లక్షలాది మంది బీఎల్ఓలు ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొంటున్నప్పుడు వారిలో అన్ని వర్గాల వారూ ఉంటారు. వాళ్లందరూ బీజేపీకి అనుకూలంగా పనిచేశారని చెప్పలేం కదా? బీఎల్ఓల పనితీరులో లోపాలు ఉంటే ఉండవచ్చునుగానీ మొత్తం ప్రక్రియ అవసవ్యం అని చెప్పలేని పరిస్థితి. శుక్రవారం నాడు కొన్ని ఉప ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అన్ని చోట్లా అధికార పార్టీయే గెలిచింది. తమిళనాడు విషయమే తీసుకుందాం! తాజా ఎన్నికల్లో అన్నాడీఎంకే తరఫున నెగ్గి ముఖ్యమంత్రి విజయ్ పార్టీలో చేరిన ఇద్దరు రాజీనామా చేయడంతో జరిగిన ఉప ఎన్నికల్లో అధికార పార్టీనే గెలిచింది. ఆ రెండు నియోజకవర్గాలూ అన్నాడీఎంకేకు బలమైన సీట్లు. కానీ ఈ రెండు చోట్లా డీఎంకే ద్వితీయ స్థానానికే పరిమితమైంది. కేంద్రంలో బీజేపీ పెద్దలు, డీఎంకే అధినేతకు మధ్య లోపాయికారీ అవగాహన ఉందని ప్రచారం ఉంది. అలాంటప్పుడు అక్కడ ఫలితాలు డీఎంకేకు అనుకూలంగా రావాలి కదా? కానీ అధికార పార్టీకి అనుకూలంగానే ఫలితాలు వచ్చాయి కదా? ఈ నేపథ్యంలోనే ఓట్ చోరీపై ప్రతిపక్షాల ఆరోపణలు నమ్మాలో, ఎన్నికల కమిషన్ చెబుతున్నది నమ్మాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. సందేహాలు నివృత్తి చేయవలసినవారు మౌనంగా ఉండిపోవడంతో అనుమానాలు బలపడటంప్రతిపక్షాలతోపాటు కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన ఆందోళనను పోలీసు బలగాలను ప్రయోగించి అణచివేయడం సమస్యకు పరిష్కారం కాదు. ఎస్ఐఆర్ విషయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో మిగతా ఇద్దరు కమిషనర్లు తీవ్రంగా విభేదించినట్టు వచ్చిన వార్తలపైన అయినా స్పష్టత ఇవ్వాలి కదా? ఓట్ చోరీపై పిటిషన్లు దాఖలైనప్పుడు సుప్రీంకోర్టు అయినా సీరియస్‌గా తీసుకొని ఉంటే సమస్య ఇంత దూరం వచ్చేది కాదేమో! మహిళలపై అత్యాచారాలకు పాల్పడే వారి వెన్నులో వణుకు పుట్టే పరిస్థితి రావాలని సుప్రీంకోర్టు ఇటీవల వ్యాఖ్యానించింది. నిజమే, మహిళల విషయంలోనే కాదు ఎటువంటి నేరం చేయాలనుకునే వారైనా భయపడే పరిస్థితి ఉండాలి. అయితే, అలాంటి పరిస్థితి ఉండాలంటే సంబంధిత వ్యవస్థలలో జవాబుదారీతనం ఉండాలి కదా? వ్యవస్థలన్నీ బాధ్యతతో, జవాబుదారీతనంతో పనిచేస్తే నేరస్థుల వెన్నులో వణుకు పుట్టదా? వ్యవస్థలలో జవాబుదారీతనం లోపించడం వల్లనే నేరస్థులు రొమ్ము విరుచుకొని తిరగగలుగుతున్నారు. ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందన్న భావన ఏర్పడిన విషయం వాస్తవం కాదా? ఈ పరిస్థితికి న్యాయ వ్యవస్థ ప్రధాన బాధ్యత తీసుకోవాలి. వైఎస్ వివేకానందరెడ్డి హత్య ఉదంతమే తీసుకుందాం. ఈ హత్య వెనుక కర్త కర్మ క్రియ ఎవరో అందరికీ తెలిసిందే. దర్యాప్తు సంస్థ సీబీఐకి మాత్రం తెలుసుకొనే ఆసక్తి ఉండదు. అందుకు మరెవరో కారణమని అంటారు. మరోవైపు కేసు విచారణలో పురోగతి ఉండదు. అంటే హత్య కేసు విషయంలో కేంద్ర ప్రభుత్వం గానీ, సీబీఐ గానీ, న్యాయ వ్యవస్థ గానీ బాధ్యతగా వ్యవహరించడం లేదని ఎవరైనా భావిస్తే తప్పు ఎలా అవుతుంది? మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిపై దాఖలైన అవినీతి కేసుల విషయం కూడా అంతే. ఇలాంటి కేసుల విచారణలో అతీ గతీ లేకపోవడం, ఏళ్లూ పూళ్లూ గడచినా నేరస్థులకు శిక్ష పడకపోవడం వల్ల వ్యవస్థలంటే లెక్కలేనితనం వస్తోంది. ఈ దేశంలో ఎటువంటి నేరం చేసినా డబ్బు, పలుకుబడి ఉంటే శిక్ష పడకుండా తప్పించుకోవచ్చు అన్న భావన దేశ ప్రజలలో నానాటికీ బలపడుతోంది. ఈ పరిస్థితికి తాము ఎంత కారకులమో ఆయా వ్యవస్థలకు చెందిన వాళ్లు ఆత్మపరిశీలన చేసుకోవాలి. వ్యవస్థల్లో జవాబుదారీతనం లోపించడం వల్ల ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలు కూడా అపసవ్యంగా ఉంటున్నాయి. రాజకీయ పార్టీల ఉచితాల జాతరలో తమకు నిజంగా ఏమి కావాలో తెలుసుకోలేని స్థితిలోకి ప్రజలు వెళ్లిపోతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో వసతుల కొరతపై ఫ్రాన్స్ దేశంలో ఆందోళనలు మిన్నంటుతున్నాయి. చిన్న పిల్లలు వీధుల్లోకి వస్తున్నారు. ఇదే అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ అధినేత అభిజీత్ దీప్కే ఆందోళనలకు పిలుపునిస్తే స్పందన కరువైంది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ విషయంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సీజేపీ ఆందోళనకు పిలుపునిచ్చినప్పుడు దేశవ్యాప్తంగా యువత రోడ్లపైకి వచ్చారు. ఇప్పుడు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ సీజేపీ చేపట్టిన ఆందోళనకు కూడా మద్దతు లభిస్తోంది. అప్పుడు ధర్మేంద్ర ప్రధాన్-- ఇప్పుడు జ్ఞానేశ్ కుమార్. వ్యక్తులు కేంద్రంగా ఆందోళనలు చేపడితేనే మద్దతు లభిస్తుందా? ప్రజల సామూహిక ప్రయోజనాల కోసం ఉద్యమాలకు పిలుపునిస్తే పట్టించుకోరా? ఈ ధోరణిని ఎలా అర్థం చేసుకోవాలి? ఒక ధర్మేంద్ర ప్రధాన్, మరో జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసినంత మాత్రాన వ్యవస్థలు బాగుపడతాయా? వ్యవస్థలపై తాత్కాలికంగా ఒత్తిడి తీసుకురావడానికి మాత్రమే ఇలాంటి ఆందోళనలు ఉపయోగపడతాయి. కొన్ని అంశాలపై మాత్రమే ప్రజల్లో స్పందన ఉండటం వాంఛనీయం కాదు. నేరం చేయాలనుకునే వారిలోనే కాదు-- వ్యవస్థల్లో కూడా భయం ఉండాలి. తాము బాధ్యతతో, జవాబుదారీతనంతో పనిచేయకపోతే ప్రజల్లో అలజడి ఏర్పడుతుందన్న భయం ఆయా వ్యవస్థల అధిపతుల్లో ఏర్పడాలి. ఎన్నికల కమిషన్ విషయమే తీసుకుందాం. ఎన్నికల కమిషన్ ఈ దేశ ప్రజలకు మాత్రమే జవాబుదారీగా ఉండాలి.

సోయిలేని సర్కార్! బతుకమ్మ పండుగ పట్టని ప్రజాప్రతినిధులు!

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ అక్టోబర్ 11

బతుకమ్మ కుంటలో నీళ్లు లేక మహిళల అవస్థలు.. మురుగునీటిలో బతుకమ్మల నిమజ్జనం దురదృష్టకరం! తెలంగాణ సంస్కృతి, సం ప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ. తెలంగాణ రాష్ట్రం ఏర్ప డిన తర్వాత ఈ పండుగను రాష్ట్రవ్యాప్తంగా అధికారి కంగా, అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవా యితీగా మారింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కో వాల్సి వస్తోందని బీఆర్ఎస్ నాయకులు సిందం శ్రీకాంత్ యాదవ్ విమర్శించారు. బతుకమ్మ పండుగ మొదటి రోజే అపశృతి!హైదర్‌నగర్ పరిధిలోని అంబీర్ చెరువు వద్ద ఉన్న బతుకమ్మ కుంటలో కనీసం నీళ్లు కూడా నింపకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. పండుగ మొదటి రోజు కావడంతో చుట్టుపక్కల కాలనీల నుంచి వందలాది మంది మహిళలు తమ బతుకమ్మ లతో అక్కడికి చేరుకున్నారు. అయితే, కుంటలో నీళు లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. చేసేదేమీ లేక కొందరు మహిళలు పక్కనే ఉన్న అంబీర్ చెరువులోని మురుగునీటిలో బతుకమ్మలను నిమజ్జనం చేసి వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆడపడుచులకు అత్యంత పవిత్రమైన బతుకమ్మ పండుగ సమయంలో కనీస ఏర్పాట్లు కూడా చేయకపోవడం సిగ్గుచేటని శ్రీకాంత్ యాదవ్ మండిపడ్డారు. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను పట్టిం చుకోకుండా తమ సొంత వ్యవహారాల్లో నిమగ్న మవడం దురదృష్టకరమని విమర్శించారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించాలి! కనీసం ఇప్పటికైనా శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని అన్ని బతుకమ్మ కుంటలను పరిశీలించి, పండుగ నిర్వహ ణకు అవసరమైన నీటిని నింపాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, మహిళలకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికా



రులను డిమాండ్ చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు గౌరవం ఇవ్వడమంటే మాటల్లో చెప్పడం మాత్రమే కాదని, పండుగల సమయంలో మహిళలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆచరణలో చూపించాలని ఆయన హితవు పలికారు.

ఎన్టీఆర్ నగర్ గ్యార్వి షరీఫ్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గణేష్ నేత

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ అక్టోబర్ 11

. ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లోనీ ఈద్గాలో నిర్వహించిన పవిత్ర గ్యార్వీ షరీఫ్ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ మత సామ రస్యానికి ప్రతీక గ్యార్వి షరీఫ్ ఉత్సవం



అని, కుల మతాలకు అతీతంగా అందరూ అన్ని పండగలు కలిసిమెలసి ఎన్టిఆర్ నగర్ లో నిర్వహించడం మంచి పరిమాణం అన్నారు. మత సామరస్యాన్ని కాపాడు కోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖలీమ్, షకీర్, సత్తార్, నవాజ్ రామకృష్ణ నిజామ్ యాస్మిన్, మోహముద తదితరులు పాల్గొన్నారు.

వివిధ శాఖలో పనిచేయుచున్న సుమారు 50 మంది కార్మికులకు సన్మానం చేసి నగదు బహుమతులు అందజేసిన రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ అక్టోబర్ 11



శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ రామకృష్ణ వీధిలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీలో వివిధ శాఖలు పనిచేయుచున్న కార్మికులకు సన్మానం చేసి నగదు బహుమతులు సుమారు 50 మంది కార్మికులకు అందజేసిన అధ్యక్షులు జనంవల్లి పురేందర్ రెడ్డి, కార్యదర్శి రామచంద్ర రావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దసరాకు కాలనీలో పనిచేసే వాచ్మెన్లు పారిశుద్ధ కార్మికులు వీధిలైట్ల కార్మి కులు వాటర్ వర్క్స్ డ్రైనేజీ ఎలక్ట్రిసిటీ కార్మికుల ందరినీ కాలనీలో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం చేయడం నగదు బహుమతులు ఇవ్వడం గత ఐదు సంవత్సరాల నుంచి జరుగుచున్నది కాలనీ కార్మికుల వలన మా కాలనీకి మంచి పేరు ప్రఖ్యా తులు రావడం మాకు ఎంతో గర్వకారంగా ఉందని అధ్యక్షులు పురంధర్ రెడ్డి తెలిపారు మా కాలనీకి కార్మికులే మాకు బలం మా కాలనీ ప్రజలు మాకు బలగం భావిస్తూ కావున కార్మికులు కాలనీవాసుల సమక్షంలో మేము ఏ కార్యక్రమమైనా విజయ వంతంగా ముందుకు తీసుకెళ్తూ సుమారు 40 సంవత్సరాల నుండి తీసుకెళుతున్నామని దీనికి సహకరిస్తున్న మా కమిటీ సభ్యులకు హృదయ పూర్వకంగా అభినందనలు తెలుపుతున్నాం కార్యదర్శి రామచంద్ర రావు మాట్లాడుతూ కాలనీవాసుల కార్మికుల సహకారంతో మేమందరం కలిసి కాలనీ అభివృద్ధికి తోడుపడుతూ ముందుకు తీసుకెళు తున్నాం. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చెంగ ల్రెడ్డి లక్ష్మీనారాయణ శ్రీధర్ జి ప్రసాద్ సూర్య నారాయణ కిషోర్ నారాయణ సింగ్ కార్మికులు కుమార్ జవాన్ నాగరాజు విజయ్ చారి శ్రీనివాస్ యాకయ్య అనసూయమ్మ వెంకటమ్మ ఆటో సురేష్ శీను టైగర్ శీను భాస్కర్ చల్లారావు తదితరులు పాల్గొన్నారు సుమారు వందమంది ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన కార్మికులకు కమిటీ సభ్యులకు కాలనీవాసులకు నా హృదయపూర్వ కంగా చేతులెత్తి నమస్కారాలు తెలియజేస్తున్న అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి.

జనసేన పార్టీ వీర మహిళల ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ హెల్త్ క్యాంపు ప్రారంభించిన జనసేన నాయకులు ముమ్మరెడి ప్రేమ కుమార్



కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ అక్టోబర్ 11

కూకట్ పల్లి కూకట్ పల్లి నియోజకవర్గం గాయత్రి నగర్ డివిజన్ వేవేకానంద నగర్ రాయల్ ఓక్స్ స్కూల్ లో జనసేన పార్టీ వీర మహిళల ఆధ్వర్యంలో రివైవ్ మల్టీ స్పెషల్ హాస్పిటల్ వారిచే ఏర్పాటు చేసినటు వంటి మెడికల్ క్యాంపు కార్యాలయాన్ని ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ గారు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ గారు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు మరియు స్థానిక ప్రజలు ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. డయాబెటిక్ ఫుట్, వెరికోవెన్స్, రక్తనాళాలు, సాధారణ ప్రసవం, మోకాళ్ళ సమస్య, మెదడు వ్యాధులు, చిన్నపిల్లల డాక్టర్ మరియు అన్ని రకాల వైద్య సదుపాయాలు అందు బాటులో ఉన్నాయని. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఇలాంటి ఉచిత ఆరోగ్య శిబిరాలు సహాయపడతాయని తెలిపారు, ఇటువంటి ప్రజాసేవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు వీర మహిళలకు మరియు ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయినింగ్ కమిటీ మెంబర్ ప్రజిత్ గౌడ్, కొల్లా శంకర్, శ్రీనివాస్ గోవిందా, పవన్, వీరబాబు మరియు వీర మహిళలు దుర్గ లక్ష్మి, రత్న వేణి, నాగ వరలక్ష్మి, రాధిక, సింధు, వానిదేవి, శ్రీదేవి, సరోజినీ, నారాయణమ్మ, సుజాత, సత్య, భూలక్ష్మి, సత్యవతి, నాగలక్ష్మి, కుమారి, వీర వేణి, విజయలక్ష్మి మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

కాచిగూడలో బీజేపీ కార్యకర్తల సమావేశం

-పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్: అక్టోబర్ 11తెహెల్కా న్యూస్:

అంబర్‌పేట్ నియోజకవర్గంలోని కాచిగూడ డివిజన్ లో బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని డివిజన్ అధ్యక్షుడు కంచనపల్లి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యక ర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతం, భవిష్యత్తు కార్యాచరణ, రాబోయే ఎన్నికల్లో అనుసరిం చాల్సిన వ్యూహాలపై పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రతి బూత్‌లో పార్టీని పటిష్ఠం చేయడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజలకు వివరించి వారి విశ్వాసాన్ని చూరగొనాలని పేర్కొన్నారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కార్యకర్తలు కృషి చేయాలని కిషన్ రెడ్డి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు



నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించి, అర్హత కలిగిన వారు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా చొరవ తీసుకో వాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీ చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచే యాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని తెలిపారు. ఈ సమా వేశంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఓ. శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి కృష్ణ యాదవ్, కన్నె రమేష్ యాదవ్, అజయ్ కుమార్, కృష్ణ గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సింగ్ యాదవ్, దామోదర్ నాయుడు, రామ్ చందర్, సుభాష్ పటేల్, చిట్టి శ్రీధర్, ప్రవీణ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక బీజేపీ నాయకులు, డివిజన్ ముఖ్య నాయ కులు, వివిధ స్థాయిల కార్యకర్తలు హాజరై పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు.

దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి ఆగమన కార్యక్రమంలో పాల్గొన్న పట్వారీ శశిధర్



కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ అక్టోబర్ 11

దసరా పండుగను పురస్కరించుకొని శ్రీ కనకదుర్గమ్మ మరియు నల్ల పోచమ్మ దేవాలయం లో దేవీ శరన్నవరాత్రుల ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన అమ్మవారి ఆగమన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి "ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ" యువ నాయకులు ప్రదీప్ రెడ్డి ఆహ్వానం మేరకు "ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు" పట్వారీ శశిధర్ హాజరై అమ్మవారి ఆగమన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షి ంచారు. దసరా శరన్నవరాత్రులు ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నింపాలని, ప్రతి కుటుంబం సుఖశాం తులతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళలు, భక్తులు మరియు టీం పట్వారీ తదితరులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

పూల సోయగాలతో 23వ వార్డు లో బతుకమ్మ సంబరాలు

-మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన కౌన్సిలర్ బర్రె పూజిత- జహంగీర్.

తెహెల్కా న్యూస్ భువనగిరి 11-10-2026.

భువనగిరి పట్టణంలోని 23వ వార్డులోని అరుంధతి యూత్ అసోసియేషన్,పూత లింగన్న బొడ్రాయి, కామునికంతా, మమ్మ యమ్మ గుడి,బెల్లంకొండ ఉపేంద ర్ ఇంటి వద్ద జరిగిన ఎంగిలిపూ ల బతుక మ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వార్డు కౌన్సి లర్ బర్రె పూజిత జహంగీర్ఆధ్వర్యం లో జరిగిన ఈవేడుకలు మహిళ ల సందడి,సాంస్కృతిక కళావై భవం మధ్య ఉత్సాహభరితంగా సాగాయి.ఈ సందర్భ ంగా మహిళలు వివి ధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలం కరించి వేడుకల్లో పాల్గొన్నారు. కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ స్వయంగా కాలనీ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ,సంప్ర దాయ పాటలు పాడుతూ వారి లో ఉత్సాహాన్ని నింపారు. బతుకమ్మల చుట్టూ మహిళలు



సంప్రదాయబద్ధంగా ఆడిపాడ డంతో వార్డులో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సం స్కృతి, సంప్రదా యాలకు ప్రతీకగా నిలిచే బతు కమ్మ పండుగ మహిళల్లో ఐక్యత ను, ఆత్మీయతను పెంపొందిస్తుం దని ఈ సందర్భంగా పలువురు పేర్కొ న్నారు.తరతరాలుగా వస్తు న్న పూల పండుగ సంప్ర దాయా లను కాపాడుతూ,భావితరాలకు వాటి గొప్పత నాన్ని చాటిచెప్పాల్సిన అవసరం ఉందని అభిప్రా యపడ్డారు.మహిళల భాగస్వా మ్యంతో వేడుకలు మరింత కళకళలాడాయి.

మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలి

-నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలి:ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

ఎల్.బి.నగర్, అక్టోబర్ 11,తెహెల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.



జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చంపాపేట డివిజన్ యువ నాయకులు సంధ్య రవి ముదిరాజ్ అధ్యక్షతన చంపాపేట డివిజన్ పరిధిలోని మోడల్ మార్కెట్ బిల్డింగ్ ఆవరణలో గత కొన్ని రోజులుగా నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన మహిళా సోదరీమణులకు సర్టిఫికెట్లను ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి,ట్రస్ట్ చైర్మన్ కమల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక మహిళ చేతిలో నైపుణ్యం ఉంటే ఒక కుటుంబం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుందని, ఒక కుటుంబం ఎదిగితే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు.మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలనే లక్ష్యంతో జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ శిక్షణలో ప్రాథమిక స్థాయి నుంచి ఆధునిక కుట్టు నైపుణ్యాలతో పాటు బ్యూటీషియన్, మెహందీ వంటి ఉపాధి అవకాశాలకు ఉపయోగపడే కోర్సుల్లో సమగ్ర శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు.శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మహిళలు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడంతో పాటు,తమ కుటుంబ ఆర్థిక అభివృద్ధికి బలమైన పునాది వేసుకునే అవకాశం పొందుతారని అన్నారు.మహిళల నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబన కోసం జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో రమాదేవి, ఉష, ప్యారి,కవిత, లావణ్య,స్వయం ప్రభు మరియు ట్రస్ట్ ప్రతినిధులు,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ,శిక్షణ పొందిన మహిళలు,స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

11వ, శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవములు

-శ్రీశ్రీశ్రీ కనక దుర్గాదేవి అమ్మవారి కృప అందరిపై ఉండాలని ప్రార్థిద్దాం.

ఎల్.బి.నగర్,అక్టోబర్ 11,తెహెల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.



నువ్వు బండ శ్రీ మాంకాళి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11వ,శ్రీ శ్రీ కనకదుర్గాదేవి శరన్నవ రాత్రుల మహోత్సవములు మొదటిరోజు శ్రీ బాలా త్రిపుర సుందరి అలంకరణతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.అక్టోబర్ 11న, శ్రీ బాలా త్రిపుర సుందరి అలంకారం,12న, శ్రీ గాయత్రీ దేవి అలంకారం, 13న, శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారం,14న, శ్రీ మహా చండీ దేవి అలంకారం.15న,శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారం,16న, శ్రీ సరస్వతీ దేవి అలంకారం,17న, శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారం, 18న,శ్రీ దుర్గా దేవి అలంకారం, 19న,శ్రీ మహిషాసుర మర్దిని దేవి అలంకారం, 20న, శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారం, మరియు దసరా జిమ్మీ పూజా కార్యక్రమాలు,ఈ 10 రోజుల పాటు అమ్మవారికి వివిధ రూపాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణలు, అభిషేకాలు మరియు భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ, తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన ప్రశాంతి విద్యానికేతన్ వేడుకలు - చైర్మన్ తంగాళ్ళ పల్లి శ్రీవాణి రవికుమార్

తెహెల్కా న్యూస్ భువనగిరి11-10-2026.





పచ్చదనం,పండుగ రెండూ మన జీవితంలో భాగమని, పర్యావర ణాన్ని కాపాడుకుంటూ సంస్కృతిని కొనసాగించాలని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. భువనగిరి లోని ప్రశాంతి స్కూల్ విద్యానికేతన్ లో నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ కార్యక్రమం మరియు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్మ న్ తంగాళ్లపల్లి శ్రీవాణి రవికుమా ర్ మహిళలకు,విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేసి, వాటి ని సంరక్షించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి తేనే భువనగిరిని హరిత భువన గిరిగా మార్చగలమని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని పిలుపు నిచ్చారు. అనంతరం అదే వేదికపై ఉపా ధ్యాయులు,మహిళా సంఘాల తో కలిసిచైర్మన్ తంగాళ్ళ పల్లి శ్రీవాణి రవికుమార్ బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ప్రకృతిలో లభించే పూలతో బతుకమ్మను పేర్చడం, ప్రకృతిని ఆరాధించడమే మన తెలంగాణ సంస్కృతి గొప్పతనమని కొని యాడారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ తంగేళ్లపల్లి రవికుమార్,కౌన్సిల ర్ తహెరా బబ్లు,ప్రశాంతి స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం,నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ప్రతినిధులు,వార్డు మహి ళా సంఘాల సభ్యులు పాల్గొ న్నారు.

అనంతరం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీలో చేరికలు

తెహెల్కా న్యూస్ భువనగిరి11-10-2026.



భువనగిరి మండల అనంతారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకు లు మండల ఓబిసి ప్రధాన కార్య దర్శి దొనగిరి వేణు కాంగ్రెస్ పార్టీ ని వీడి బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ నాయకులు చింతల వెంకటేశ్వర రెడ్డి భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో జాయిన్ కావ డం జరిగింది. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతు.. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి ఆనాటి నుంచి పార్టీని పట్టుకొని ఉండి కష్టం అనక సుఖమనక జండా మోసే సీనియర్ కాంగ్రెస్ నాయ కులకు అన్యాయమే జరిగిందని పార్టీ సీనియర్లను పక్కనపెట్టి 12 పార్టీలు మార్చిన వారిని అందలమెక్కించారని అన్నారు. ఎమ్మెల్యే చుట్టూ ఒక నాలుగురు కోవర్ట్ గా చేరి పార్టీ సీనియర్ నా యకుల కు అన్యాయం చేశారనీ అన్నారు. ఈకార్యక్రమంలో మండల బిఆర్ ఎస్ అధ్యక్షులు జనగాం పాండు గ్రామ శాఖ అధ్యక్షులు బొట్టు మల్లేశం మాజీ సర్పంచ్ చిందం మల్లిఖార్జున పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ గుమ్మడి సురేందర్ రెడ్డి తెరాస యూత్ వైస్ ప్రసిడెంట్ పోల ప్రవీణ్ గౌడ్ సింగిరెడ్డి ప్రభా కర్ రెడ్డి జిల్లానాయకులు వల్లపు విజయ్ వార్డు సభ్యులు దండెబో యిన బాలరాజు సామల చంద్ర మోహన్ కందాడి సంతోష్ రెడ్డి కొండం శివ చింతల నర్సిరెడ్డి పల్లెపాటి నరసింహ బొట్టు శేఖర్ కొంగల సాయి రేపాక నరేష్ మచ్చ శివ సాయి మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బంగారం ధరలు



manepally Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP
Google play App Store
GOLD & SILVER RATES

24 kt	₹	1,51,420	10gms
22 kt	₹	1,38,800	10gms
SILVER	₹	2,29,900	1kg

Contact: 6309 111299 | 99120 10888

అమ్మవారి పూజలో పాల్గొన్న ఎర్రబెల్లి సతీష్ రావు

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ అక్టోబర్ 11



ఏఎస్ రాజునగర్ కాలనీలో నిర్వహించిన అమ్మవారి పూజా కార్యక్రమంలో బీఆర్ ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొన్నారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి అమ్మ వారిని దర్శిం చుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఆలేరు పట్టణంలో ఎస్‌బీ స్టోర్ ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



తెహెల్కా న్యూస్ భువనగిరి11-10-2026.

ఆలేరు వట్టణంలో ఏర్పాటు చేసి న ఎస్‌బీ స్టోర్‌ను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా స్టోర్ నిర్వాహకు లకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన స్టోర్ ప్రజలకు అందుబాటులోకి రావడం పట్ల నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు ,స్టోర్ నిర్వాహ కులు తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ కోనేరులో బతుకమ్మ వేడుకలు

-తెలంగాణ సంస్కృతి మన గర్వం.. బతుకమ్మ పండుగ మన ఆత్మగౌరవం!



ఎల్.బి.నగర్,అక్టోబర్ 11,తెహెల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని, నాగోల్ డివిజన్ నువ్వుల బండ కాలనీలో తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, మహిళలంతా ఒక్కచోట చేరి ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ పండుగ మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతుందని అన్నారు.మన పూర్వీకుల నుంచి వారసత్వంగా,వస్తున్న ఇలాంటి గొప్ప పండుగలను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని తెలిపారు. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని, తెలంగాణ ఆడపడుచులందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మహిళలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో పండుగను ఆనందంగా జరుపుకున్నారు.

జిల్లాగా ఏర్పడి పది సంవత్స రాలు పూర్తయిన సందర్భంగా కేసీఆర్ ఫ్లెక్సీ కి పాలాభిషేకం



తెహెల్కా న్యూస్ భువనగిరి11-10-2026.

యాదాద్రి భువనగిరి జిల్లా ఏర్ప డి 10 వసంతాలు పూర్తయిన సంద ర్భంగా తెలంగాణ జాతిపి త,బిఆర్ఎస్అధినేత కేసీఆర్ కి కృతజ్ఞతలు తెలుపుతు భువన గిరి పట్టణంలో జగ్జీవన్ రాం చౌర స్తా లో కేసీఆర్ ఫ్లెక్సీ కి పాలాభి షేకం చేసి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముం దు బాణసంచా కాల్చి సంబరా లు నిర్వహించి అనంతరం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాల యం లో తెలంగాణ ఉద్యమం లో కీలకపాత్ర పోషించిన కవులను, రచయితలను, గాయకులను, కళాకారులను, పాత్రికే యులను ఉద్యమకారులను ఘనంగా సన్మానించడం జరిగింది.

ఫ్లైఓవర్ పనులకు 'పిండ ప్రదానం'

-సుచిత్ర--మేడ్చల్ నిర్మాణ జాప్యంపై ప్రజా సంఘాల నిరసన



తెహెల్కా న్యూస్(అక్టోబర్ 11) హైదరాబాద్ :

ఏళ్లు గడుస్తున్నా సుచిత్ర--మేడ్చల్ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తికాకపోవడంపై స్థానికులు, ప్రజా సంఘాలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాయి. జాతీయ రహదారి 44పై నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ కష్టాలకు నిరసనగా మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం సుచిత్ర జంక్షన్ వద్ద వినూత్న నిరసన చేపట్టారు. అర్ధంతరంగా నిలిచిపోయిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ పిండ ప్రదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ.. ఫ్లైఓవర్ పనులు పూర్తికాకపోవడంతో ఏళ్లుగా వాహనదారులు ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం వేలాది మంది వాహనదారులు ట్రాఫిక్ రద్దీలో గంటల తరబడి చిక్కుకుపోతున్నారని తెలిపారు. నిర్మాణ ప్రాంతంలో దుమ్ము, ధూళి కారణంగా స్థానికులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ప్రజలకు ఎంతో అవసరమైన ఫ్లైఓవర్ నిర్మాణం విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. పనులు ఎప్పుడు పూర్తవుతాయో స్పష్టత లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాలకులు, సంబ ంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నిలిచిపోయిన పనులను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ప్రజలను సమీకరించి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని మేడ్చల్ మెట్రో సాధన సమితి ప్రతినిధులు హెచ్చరించారు. ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు ఇకనైనా ముగింపు పలికి, ప్రయాణికులకు ఉపశమనం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

శ్రీధర్ చారి కుటుంబాన్ని పరామర్శించిన తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు బాలయ్య



తెహెల్కా న్యూస్ మెదక్ జిల్లా టేక్మాల్ ప్రతినిధి (అక్టోబర్ 11)

టేక్మాల్ మండల సీనియర్ నాయకుడు శ్రీధర్ చారి మాతృమూర్తి వారం రోజుల క్రితం మృతి చెందారు. ఈ విషయం ఈరోజు తెలియడంతో తెలంగాణ రక్షణ సేన పార్టీ అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాసన్న గారి బాలయ్య టేక్మాల్‌కు చేరుకుని శ్రీధర్ చారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాతృమూర్తి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ టేక్మాల్ మండల ఇన్‌చార్జి బొబ్బిలి సుధాకర్ పాల్గొని శ్రీధర్ చారి కుటుంబాన్ని పరామర్శించారు.

అత్యాచారం-POCSO, ITPA (అనైతిక రవాణా నిరోధక చట్టం) కేసుల గుర్తింపు

టోలీచౌకీ పోలీసులచే 8 మంది నిందితుల అరెస్టు



అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్‌తెహెల్కా న్యూస్

హైదరాబాద్‌లోని టోలీచౌకీ పోలీసులు అత్యాచారం-POCSO, ITPA కేసులను ఛేదించి, 24 గంటల వ్యవధిలోనే 8 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

-కేసు వివరాలు:

టోలీచౌకీ పోలీస్ స్టేషన్ క్రైమ్ నం. 473/2026; BNS సెక్షన్లు 137(2), 140(3), 143(2)(3), 144, 127(2), 64, 61, r/w 3(5); POCSO చట్టం సెక్షన్లు 5 r/w 6, 16 r/w 17; మరియు ITPA సెక్షన్లు 3, 4, 5 కింద కేసులు నమోదు చేయబడ్డాయి.

-నిందితుల పేర్లు:

A-1. షేక్ ఆతిఫ్
A-2. సాబియా బేగం
A-3. మహమ్మద్ హాజీమియా
A-4. ఆఫ్రీన్ అలియాస్ సనా
A-5. సమ్రీన్ బేగం
A-6. మహమ్మద్ నదీమ్
A-7. మహమ్మద్ కైఫుద్దీన్
A-8. అలీ బిన్ అక్రమ్

-సంక్షిప్త వివరాలు:

02/09/2026న, ఆతిఫ్ అనే వ్యక్తి బాధితురాలైన బాలికను టోలీచౌకీ నుండి తన ఆటో (TS 30 T 8350)లో కిడ్నాప్ చేసి, తన పథకం ప్రకారం అట్టాపూర్ వద్ద దించాడు. అక్కడ ఆ బాలికను సనా మరియు సమ్రీన్ అనే మహిళలకు అప్పగించాడు. వారు ఆ బాలికను మంచి ఆహారం మరియు పడక (వసతి) ఆశ చూపి ఒప్పించడానికి ప్రయత్నించారు. అనంతరం, వారు బలవంతంగా ఆ బాలికను అట్టాపూర్ పిల్లర్ నంబర్ 200 సమీపంలో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న సాబియా బేగం (హాజీమియా భార్య)కు అప్పగించి, ఆమె నుండి రూ. 30,000/- తీసుకున్నారు. ఆ డబ్బును ఆతిఫ్, సనా మరియు సమ్రీన్ పంచుకున్నారు. ఆ తర్వాత సబియా బేగం బాధితురాలిని వ్యభిచారంలోకి దింపింది; అక్కడ లైంగిక సుఖం కోసం చాలా మంది వ్యక్తులు వచ్చేవారు. తనను వదిలిపెట్టమని బాధితురాలు సబియా బేగమ్‌ను అడిగినప్పుడు, వ్యభిచారం చేయించడానికి ఆతిఫ్, సనా మరియు సమ్రీన్ ఆమె (సబియా) నుండి డబ్బు తీసుకున్నారని, అందుకే ఇన్ని రోజులుగా వేర్వేరు వ్యక్తులతో ఆ పని చేయించాల్సి వచ్చిందని సబియా బేగం ఆమెకు చెప్పింది. నిందితులు A-6 నుండి A-8 వరకు ఉన్నవారు వినియోగదారులకు మరియు సెక్స్ వర్కర్లకు మధ్య సమన్వయం చేస్తూ, వారికి అవసరమైన ఏర్పాట్లు చేసేవారు. చివరకు, 05/10/2026న బాధితురాలు సబియా బేగం మరియు ఆ వ్యభిచార గృహం నుండి ఎలాగోలా తప్పించుకుని ఇంటికి చేరుకుంది. ఇంటికి వచ్చిన తర్వాత, ఆమె తన కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని తెలియజేసి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది మరియు చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. 09-10-2026న నిందితులు A-1 నుండిA-8 వరకు ఉన్నవారిని అరెస్టు చేసి, న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. స్వాధీనం చేసుకున్న ఆస్తి: 6 మొబైల్ ఫోన్లు ఒక ఆటో (నంబర్: TS 30 T 8350).

-నేర ఉద్దేశ్యం:

మైనర్ బాధితులను అక్రమ రవాణా చేయడం మరియు లైంగికంగా దోపిడీ చేయడం ద్వారా చట్టవిరుద్ధమైన ఆర్థిక లాభం పొందడమే నిందితుల ఉద్దేశ్యం. కేసు వివరాల ప్రకారం, బాధితురాలిని ఆహారం మరియు ఆశ్రయం కల్పిస్తామని నమ్మించి, వేర్వేరు ప్రాంతాలకు తరలించి, వ్యభిచారం కోసం ఇతర వ్యక్తులకు అప్పగించారు. బాధితురాలి దోపిడీకి సంబంధించి నిందితులు డబ్బును స్వీకరించి పంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుల నిర్దిష్ట పాత్రలు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలు న్యాయస్థానం ముందు విచారణ మరియు రుజువుకు లోబడి ఉంటాయి. ఈ కేసును టోలిచౌకి డివిజన్ ACP సయ్యద్ ఫయాజ్ మార్గదర్శకత్వంలో మరియు గోల్కొండ జోన్ ణజ్రూ శ్రీ జె. రాఘవేందర్ రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో, టోలిచౌకి పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి ఎల్. రమేష్ నాయక్ (SHO), జి. బలరాజ్ (అదనపు ఇన్‌స్పెక్టర్),ఎస్. రవి కుమార్ (SIP) ఛేదించారు. అత్యాచారం-POCSO, ITPA కేసును వేగంగా ఛేదించడంలో వారు అభినందనీయమైన వృత్తిపరమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌తోలిచౌకి డివిజన్, గోల్కొండ జోన్, హైదరాబాద్

రాజధానిలో దొంగల ముఠాల కలకలం

-అపార్ట్‌మెంట్లు, ఆభరణాల దుకాణాలు, ఏటీఎంలే లక్ష్యం

-పండగ సెలవుల వేళ అప్రమత్తత అవసరం

తెహెల్కా న్యూస్(అక్టోబర్ 11) హైదరాబాద్ :

నగరంలో వరుస దొంగతనాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. సాధారణ ఇళ్ల నుంచి అత్యంత భద్రత ఉంటుందని భావించే గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, ఆభరణాల దుకాణాలు, ఏటీఎంల వరకు దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారు. తక్కువ సమయంలోనే భారీ మొత్తంలో నగదు, విలువైన వస్తువులను అపహరిస్తుండటం కలవరపెడుతోంది. ఇటీవల మణికొండలోని ఫ్లోటిల్లా అపార్ట్‌మెంట్‌లో చెడ్డీ గ్యాంగ్ చోరీ ఘటన వెలుగులోకి రాగా, ఆ తర్వాత మేడిపల్లిలో ఆభరణాల దుకాణంలో భారీ దోపిడీ, శంషాబాద్ పరిధిలోని సాతంరాయిలో ఏటీఎంలో నగదు చోరీ ఘటనలు చోటుచేసుకున్నాయి. భద్రతా సిబ్బంది, సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగలు చోరీలకు పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నగర శివారు ప్రాంతాల్లోని ఇళ్లను లక్ష్యంగా చేసుకునే ముఠాల నుంచి ఏటీఎంలను కొల్లగొట్టే ముఠాల వరకు ఒక్కొక్కటి ఒక్కో పద్ధతిలో నేరాలకు పాల్పడుతున్నాయి. వీటి కదలికలు, చోరీలకు అనుసరిస్తున్న వ్యూహాలపై పోలీసులు నిఘా పెడుతున్నారు. మరోవైపు దసరా సెలవుల నేప థ్యంలో చాలామంది కుటుంబాలతో కలిసి సొం తూళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి సమయంలో ఇళ్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని అధికారులు సూచిస్తున్నారు.

-ధార్ గ్యాంగ్.. తాళం వేసిన ఇళ్లే లక్ష్యం

మహారాష్ట్రలోని ధార్ జిల్లాకు చెందిన నేరగాళ్ల ముఠాలను ధార్ గ్యాంగ్‌గా పిలుస్తారు. వ్యవసాయ పనులు లేని సమయంలో దొంగతనాలకు పాల్పడటం వీరి కార్యకలాపాల్లో ప్రధానంగా కనిపిస్తుంది. శివారు ప్రాంతాల్లోని కాలనీలను ఎంచుకుని, తాళాలు వేసిన ఇళ్లపై నిఘా పెడతారు. పగటిపూట కాలనీల్లో తిరుగుతూ ఇళ్ల పరిస్థితులను గమనించి, అనుకూల సమయం చూసుకుని రాత్రివేళ చోరీలకు పాల్పడతారు. ఒకే ప్రాంతంలో వరుసగా దొంగతనాలు చేసి అక్కడి నుంచి వెళ్లిపోతుంటారు. బస్సులు, రైళ్లలో ప్రయాణిస్తూ రాకపోకలు సాగించే ఈ ముఠాలపై నగరంలో 200కు పైగా కేసులు నమోదైనట్లు సమాచారం.

-చెడ్డీ గ్యాంగ్.. అడ్డొస్తే దాడులు

చెడ్డీ గ్యాంగ్ దొంగతనాలకు పాల్పడే తీరు భిన్నంగా ఉంటుంది. శరీరానికి నూనె రాసుకుని, చెడ్డీ మా త్రమే ధరించి చోరీలకు రావడం వల్ల ఈ పేరు వచ్చి ంది. ముఖాలకు మాస్కులు ధరించి, ఇనుప రాడ్లు, రాళ్లతో దాడులకు సిద్ధమవుతారని చెబుతారు. సాధా రణంగా వాహనాలను ఉపయోగించకుండా కాలిన డకన సంచరిస్తూ నేరాలకు పాల్పడు తుంటారు. ఇంటి యజమానులు లేదా ఇతరులు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే దాడులకు దిగే ప్రమాదం ఉంది. రాత్రి వేళ అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తిం చడం, అపరిచితులకు తలుపులు తెరవక పోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచి స్తున్నారు.



-పార్ధీ గ్యాంగ్.. ఆయుధాలతో దోపిడీలు

మధ్యప్రదేశ్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు చెందిన కొన్ని నేరగాళ్ల ముఠాలను పార్ధీ గ్యాంగ్‌గా వ్యవహరిస్తారు. పగటిపూట కూలీ పనులు చేయడం, చిన్నచిన్న వస్తువులు విక్రయించడం వంటి కార్య కలాపాల ద్వారా పరిసరాలను గమనిస్తారని సమాచారం. రాత్రివేళ చోరీలకు పాల్పడటంతోపాటు జాతీయ రహదారుల వెంట ఉన్న దుకాణాలను లక్ష్యంగా చేసుకుంటారు. ఆయుధాలతో సంచరించే ఈ ముఠాలకు సంబంధించి, అరెస్టు చేసేందుకు ప్రయత్నించిన పోలీసులపై కాల్పులకు దిగిన ఘటనలు కూడా నమోదయ్యాయి. దీంతో ఇలాంటి ముఠాల కదలికలపై పోలీసులు అప్రమత్తంగా ఉంటున్నారు.

-మేవాత్ ముఠాలు.. ఏటీఎంలపై గురి

ఏటీఎంలలో నగదును అపహరించడమే లక్ష్యంగా పనిచేసే ముఠాల్లో మేవాత్ ప్రాంతానికి చెందిన నేరగాళ్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌లోని డీగ్, హర్యానాలోని నుహ్ ప్రాంతాలను కలిపి మేవాత్ ప్రాంతంగా వ్యవహరిస్తారు. ఈ ముఠాలు ఏటీఎంలను లక్ష్యంగా చేసుకుని కొద్ది నిమిషాల్లోనే నగదును అపహరించేందుకు ప్రయత్నిస్తాయి. ఒకే రోజు పలు ఏటీఎంల వద్ద చోరీలకు పాల్పడే సందర్భాలుంటాయి. ప్రాంతాల మధ్య వేగంగా కదులుతూ, పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నం చేయడంతో వీరిని పట్టుకోవడం సవాలుగా మారుతోందని అధికారులు చెబుతున్నారు.

-ఊరెళ్లే ముందు ఈ జాగ్రత్తలు తప్పనిసరి

దసరా సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలి. ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో అనుమానాస్పద వ్యక్తులు ప్రవేశిస్తే లైట్లు వెలిగేలా, అలారం మోగేలా, మొబైల్ ఫోన్‌కు సమాచారం అందేలా ఆధునిక భద్రతా పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి. ఇంటి పరిసరాలను ప్రత్యక్షంగా గమనించేందుకు వీలున్న సీసీ కెమెరాలు ఉపయోగపడతాయి. ప్రధాన ద్వారానికి పటిష్ఠమైన తాళం ఏర్పాటు చేయడంతోపాటు తలుపులు, కిటికీలకు సెన్సర్లతో కూడిన అలారాలు అమర్చుకోవాలి. ఇంటికి తాళం వేసి వెళ్లినప్పుడు బయట నుంచి ఇల్లు ఖాళీగా ఉన్నట్లు స్పష్టంగా కనిపించకుండా జాగ్రత్తపడాలి. ఇంట్లో ఒక లైటు వెలిగేలా ఏర్పాటు చేసుకోవడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. అయితే, ఇవి ఇతర భద్రతా చర్యలకు ప్రత్యామ్నాయం కాదని గుర్తించాలి. కుటుంబంతో కలిసి సొంతూరికి లేదా విహారయాత్రకు వెళ్తున్న విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో ముందుగానే వెల్లడించకూడదు. ఎక్కువ రోజుల పాటు ఇంటికి తాళం వేసి వెళ్లాల్సి వస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలి. అపార్ట్‌మెంట్లలో భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చూడాలి. కొత్త వ్యక్తుల రాకపోకలను నమోదు చేసేందుకు రిజిస్టర్ నిర్వహించాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, చోరీకి ప్రయత్నిస్తున్నట్లు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. అత్యవసర పరిస్థితుల్లో 100కు ఫోన్ చేసి సహాయం కోరవచ్చు. పండగ సెలవులను ప్రశాంతంగా గడిపేందుకు ఇంటి భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయకూడదు. అప్రమత్తత, ముందస్తు ఏర్పాట్లు, అనుమానాస్పద కదలికలపై సకాలంలో సమాచారం ఇవ్వడం ద్వారా చోరీల ముప్పును కొంతవరకు తగ్గించవచ్చు.

బిజినెస్

కంటి చూపుతో చెల్లింపులు



షాపింగ్ చేసినప్పుడు జేబులోంచి నగదు లేదా ఫోన్ లేదా డెబిట్/క్రెడిట్ కార్డు బయటికి తీయాల్సిన అవసరం లేకుండా కంటి చూపుతో చెల్లించవచ్చిక. ఇందుకోసం తయారు చేసిన ఏఐ ఆధారిత కళ్లద్దాలను ముకేశ్ అంబానీకి చెందిన జియో..'ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) 2026'లో ప్రదర్శించింది. ఈ జియో ఏఐ గ్లాసెస్ ధరించి క్యూఆర్ కోడ్ వైపు చూసి మౌఖిక ఆదేశమిస్తే చాలు చెల్లింపు పూర్తవుతుంది. యూపీఐలో సర్కిల్స్ ఫీచర్స్ ద్వారా ఈ పద్ధతిలో ఒకసారి రూ.5,000 వరకు, నెలలో మొత్తం రూ.15,000 వరకు చెల్లింపులు జరిపే వీలుంటుంది. అంతేకాదు, ఈ కళ్లద్దాల్లోని ఏఐ వాయిస్ అసిస్టెంట్ ఫీచర్ పలు భారతీయ భాషలను వినియోగదారుకు కావాల్సిన భాషలోకి అనువదించగలదు.

'టీవీఎస్‌లో ఇంటిపోరు!

టాటా ట్రస్ట్‌లు, టాటా సన్స్ బోర్డు మధ్య జరుగుతున్న నాయకత్వ పోరులో నోయల్ టాటాతో విబేధిస్తున్న వేణు శ్రీనివాసన్‌కు మరోపక్క ఇంటిపోరు కూడా మొదలైంది. ప్రపంచంలో మూడో అతిపెద్ద ద్విచక్ర వాహన తయారీ కంపెనీ టీవీఎస్ మోటార్, దాని హోల్డింగ్ కంపెనీ టీవీఎస్ హోల్డింగ్స్ లిమిటెడ్ గౌరవ చైర్మన్ అయిన వేణు శ్రీనివాసన్ పిల్లల మధ్య యాజమాన్య హక్కులు, వారసత్వ ఏర్పాట్లకు సంబంధించి తీవ్ర విబేధాలు వెలుగుచూశాయి. వేణు శ్రీనివాసన్ భార్య, ట్రాక్టర్స్ అండ్ ఫామ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ (టాఫే) చైర్మన్ మల్లికా శ్రీనివాసన్.. ఈ సమస్యను సామరస్యంగా, నిష్పక్షపాతంగా పరిష్కరించుకోవాలని తన పిల్లలను కోరుతున్నట్లు తెలిసింది. శ్రీనివాసన్ దంపతుల కుమారుడైన సుదర్శన్ వేణు ప్రస్తుతం టీవీఎస్ మోటార్ కంపెనీ చైర్మన్, ఎండీగా ఉన్నా రు. టీవీఎస్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కూ ఎండీగా వ్యవహరిస్తున్నారు. ఇక కుమార్తె లక్ష్మీ వేణు టీవీఎస్ హోల్డింగ్స్ ఎండీ, సుందరం క్లేటాన్ ఎండీ, టాఫే వైస్ చైర్మన్‌గా ఉన్నారు.

-2025 ఏప్రిల్ నుంచే మొదలు..

2025 ఏప్రిల్‌లో టీవీఎస్ హోల్డింగ్స్ ట్రస్ట్‌ల నిర్మాణం ద్వారా సుదర్శన్ వేణును కంపెనీలో మెజారిటీ లబ్ధిదారుగా ప్రకటించింది. దాంతో లక్ష్మీ వేణు కంపెనీలో సమాన హక్కులు కోరడంతో ఇద్దరి మధ్య విబేధాలు మొదలయ్యాయి. అలాగే, కుటుంబ సంపదను కూడా సమానంగా పంచాలని, ఈ విషయంపై చర్చించాలని ఆమె చాలా కాలంగా కోరుతున్నట్లు తెలిసింది. టీవీఎస్ హోల్డింగ్స్ వార్షిక నివేదిక ప్రకారం.. కంపెనీలో 74.5 శాతం వాటాను కుటుంబ సభ్యులు/ప్రమోటర్లు కలిగి ఉన్నారు. అందులో 66.55 శాతం వాటాను వేణు శ్రీనివాసన్.. టీవీఎస్ ట్రస్ట్‌ల ద్వారా కలిగి ఉన్నారు.

-2024 మార్చిలో ఎంఓయూ



వ్యాపారాల సెటిల్‌మెంట్‌కు సంబంధించి 2024 మార్చిలో కుటుంబసభ్యుల మధ్య ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. అయితే, ఇది ఆయా వ్యాపారాల్లో టీవీఎస్ బ్రాండ్‌ను ఉపయోగించుకోవడం, నాన్-కంపీట్ (ఒకరితో మరొకరు పోటీపడవద్దన్న) ఒప్పందం మాత్రమేననీ.. ఆస్తుల పంపకానికి సంబంధించినది కాదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆస్తుల పంపకంపై ఈ కుటుంబం ఇంకా ఒప్పందానికి రావాల్సి ఉందన్నారు.

-గ్రూప్ నేపథ్యమిదీ..

టీవీ సుందరమ్ అయ్యంగార్ 1911లో టీవీఎస్ గ్రూప్‌ను ప్రారంభించారు. దక్షిణ భారతంలోని అతిపెద్ద కుటుంబ వ్యాపారాల్లో ఒకటైన టీవీఎస్ గ్రూప్ వ్యాపారాలను ప్రస్తుతం మూడు, నాలుగోతరం కుటుంబ సభ్యులు నడుపుతున్నారు. వ్యాపారాల పంపకాల్లో భాగంగా మూడో తరానికి చెందిన వేణు శ్రీనివాసన్‌కు టీవీఎస్ మోటార్, సుందరం క్లేటాన్ లభించాయి. శ్రీనివాసన్ ఈ వ్యాపారాల పగ్గాలను ఇప్పటికే పిల్లలకు అప్పగించి గౌరవ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

'సత్య'లో దసరా, దీపావళి ఆఫర్లు

రానున్న దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని అక్షయ వృక్షం పేరిట స్క్రాచ్ కార్డ్ ద్వారా రూ.2 కోట్ల విలువైన బహుమతులను గెలుచుకునే అవకాశాన్ని సత్య ఎలక్ష?ట్రానిక్స్ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని సత్య షోరూమ్స్‌ల్లో రూ.5,000కు పైబడి ఉత్పత్తు లు కొనుగోలు చేసిన వినియోగదారులకు ఈ స్క్రాచ్ కార్డ్ ఆఫర్ అందుబాటులో ఉంటుందని సంస్థ ఎండీ జెస్సన్ శామ్యూల్ తెలిపారు. ఈ బహుమతుల్లో నెక్ బ్యాండ్స్, ఎయిర్‌బడ్స్ సహా డైమెండ్ నెకట?సలు, బంగా రు కాయిన్స్ ఉన్నాయని వివరించారు. నవంబరు 20వ తేదీ వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని శామ్యూల్ వెల్లడించారు. అలాగే ఫెస్టివల్ ఆఫర్ల కింద రూ.50,000 వరకు క్యాష్‌బ్యాక్ సహా ఎంపిక చేసిన క్రెడిట్ కార్డులపై క్యాష్ బ్యాక్ ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని శామ్యూల్ తెలిపారు.



స్పోర్ట్స్

అంతర్జాతీయ బాలికా దినోత్సవం వేళ.. స్మృతి మంధానకు ప్రత్యేక గౌరవం



భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్, స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐక్యరాజ్యసమితికి చెందిన యునిసెఫ్ ఇండియా ఆమెను తమ 'సెలబ్రిటీ అడ్వకేట్'గా నియమించింది. ఈ కొత్త బాధ్యతలో భాగంగా బాలికల హక్కులు, భద్రత, వారి సామర్థ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు క్రీడల్లో బాలికలకు సమాన అవకాశాలు కల్పించేందుకు స్మృతి కృషి చేస్తుంది. బాలికల ఆరోగ్యం, శ్రేయస్సు, సాధికారత కోసం యునిసెఫ్ ఇండియా చేపట్టే కార్యక్రమాలకు మంధాన మద్దతుగా నిలవనుంది.ఈ నియామకంపై స్మృతి మంధాన హర్షం వ్యక్తం చేసింది. "యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా చేరడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. క్రికెట్ ఆడుతూ పెరిగిన నాకు, ప్రతి కల ఒక అవకాశంతోనే మొదలవుతుందని తెలిసింది. కఠోర శ్రమ, పట్టుదల, ప్రోత్సాహం ఉంటే ఆ అవకాశాన్ని అద్భుతంగా మార్చుకోవచ్చు. ప్రతి చిన్నారి, యువత పెద్ద కలలు కని, వారి పూర్తి సామర్థ్యాన్ని చేరుకునే అవకాశం పొందాలి" అని ఆమె పేర్కొంది. గతంలో కూడా స్మృతి లింగ సమానత్వంపై యునిసెఫ్-ఐసీసీ నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంది.యునిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రే మాట్లాడుతూ.. స్మృతి నియామకంపై ఆనందం వ్యక్తం చేశారు. "ఒక యువ అథ్లెట్‌గా ప్రయాణం మొదలుపెట్టి, ప్రపంచ స్థాయి క్రికెట్ ఐకాన్‌గా ఎదిగిన స్మృతి ప్రస్థానం.. ప్రతిభకు అవకాశం తోడైతే ఏం సాధించవచ్చో బాలికలకు నిరూపిస్తుంది. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న భారత్‌లో, బాలికల హక్కులు, నాయకత్వం, శ్రేయస్సుపై పెట్టుబడి పెట్టడమే దేశానికి అత్యంత తెలివైన పెట్టుబడి. ప్రతి బాలిక నేర్చుకోవడానికి, ఆడటానికి, నాయకత్వం వహించ డానికి, తన సామర్థ్యాన్ని నిరూపించు కోవడానికి స్మృతితో కలిసి పనిచేయాలని ఎదురు చూస్తున్నాం" అని వివరించారు.ఇటీవలే హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో స్మృతి మంధాన జట్టు పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. 2025లో తొలిసారిగా ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులో ఆమె కీలక సభ్యురాలు. అదే ఏడాది, ఒక క్యాలెండర్ ఇయర్‌లో 1,000 వన్డే పరుగులు చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది. 2026 నాటికి మహిళల అంతర్జాతీయ క్రికెట్, టీ20 ఫార్మాట్లలో అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా ఆమె నిలిచింది. ప్రస్తుతం మహిళల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న స్మృతి, అర్జున అవార్డు గ్రహీత, అలాగే రెండుసార్లు 'ఐసీసీ ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును కూడా గెలుచుకుంది.

భారత్‌తో వన్డే సిరీస్‌కు న్యూజిలాండ్ జట్టు ప్రకటన.. ఫెర్గూసన్ రీఎంట్రీ

భారత్‌తో త్వరలో జరగనున్న 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం న్యూజిలాండ్ క్రికెట్ (ఎన్‌జడ్‌సీ) తమ జట్టును ప్రకటించింది. ఈ సిరీస్‌కు వైట్-బాల్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ నాయకత్వం వహించనున్నాడు. స్టార్ పేసర్ లాకీ ఫెర్గూసన్, ఫిన్ అలెన్, టిమ్ సైఫర్ట్ చాలాకాలం తర్వాత తిరిగి వన్డే జట్టులోకి రావడం విశేషం. గాయం కారణంగా గత టీ20 సిరీస్‌కు దూరమైన యువ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర కోలుకుని, తొలి మూడు మ్యాచ్‌లకు అందుబాటులోకి వచ్చాడు.నవంబర్ 4న ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్‌లో తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది జనవరిలో భారత్ గడ్డపై చారిత్రక వన్డే సిరీస్ (2-1) గెలిచిన కివీస్, అదే జోరును సొంతగడ్డపై కొనసాగించాలని భావిస్తోంది. అయితే, ఈ సిరీస్ తర్వాత భారత్‌తోనే టెస్ట్ సిరీస్ ఉన్న నేపథ్యంలో, ఆటగాళ్లపై భారం తగ్గించేందుకు కివీస్ బోర్డు ఓ ప్రయోగాత్మక నిర్ణయం తీసుకుంది. సిరీస్‌లోని తొలి మూడు వన్డేలకు ఒక జట్టును, చివరి రెండు వన్డేలకు మరో జట్టును ఎంపిక చేసింది.తొలి మూడు మ్యాచ్‌ల తర్వాత కొంతమంది ఆటగాళ్లు టెస్ట్ సిరీస్ సన్నాహకాల కోసం వెల్లింగ్‌టన్‌కు వెళ్తారని, వారి స్థానంలో మరో ఏడుగురు ఆటగాళ్లు జట్టుతో చేరతారని హెడ్ కోచ్ రాబ్ వాల్టర్ తెలిపాడు. "భారత్ వంటి బలమైన జట్టుతో ఆడటం మాకు పెద్ద సవాల్. ఏడాది దూరంలో ఉన్న వన్డే ప్రపంచకప్‌కు ఈ సిరీస్ సన్నాహకంగా ఉపయోగపడుతుంది. ఫెర్గూసన్, అలెన్ వంటి మ్యాచ్ విన్నర్లు తిరిగి రావడం జట్టుకు బలం చేకూరుస్తుంది" అని అన్నాడు.



అభిషేక్ శర్మ విధ్వంసం.. టీమిండియా భారీ స్కోరు



వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడో టీ20 మ్యాచ్‌లో భారత బ్యాటర్లు దూకుడు ప్రదర్శించారు. ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం వేదికగా తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా, నిర్ణీత 20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌట్ అయింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (69; 30 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లు) భారీ షాట్లతో విరుచుకుపడగా.. ఇషాన్ కిషన్ (37; 18 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్సర్) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో వెస్టిండీస్ ముందు 224 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్, భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఆరంభంలోనే సంజూ శాంసన్ (3) వికెట్‌ను కోల్పోయినా, మరో ఓపెనర్ అభిషేక్ శర్మ, వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్ విండీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు కేవలం 40 బంతుల్లోనే 108 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ తన విధ్వంసక బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. పవర్ ప్లే ముగిసేసరికి భారత్ వికెట్ నష్టానికి 87 పరుగులు చేసింది.అయితే, భారీ స్కోరు దిశగా సాగుతున్న భారత్‌కు విండీస్ బౌలర్లు షాకిచ్చారు. ఇషాన్ కిషన్‌ను రోస్టన్ ఛేజ్ ఔట్ చేయగా, అదే ఓవర్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (1) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ఆ కొద్దిసేపటికే, మరింత ప్రమాదకరంగా మారుతున్న అభిషేక్ శర్మ కూడా ఔట్ కావడంతో భారత్ 124 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో తిలక్ వర్మ (28), నితీశ్ కుమార్ రెడ్డి (21), అక్షర్ పటేల్ (20) కీలక ఇన్నింగ్స్‌లతో జట్టును ఆదుకున్నారు. దాంతో, టీమిండియా స్కోరు 220 పరుగులు దాటింది. వెస్టిండీస్ బౌలర్లలో రోస్టన్ ఛేజ్, షమార్ జోసెఫ్, షమార్ స్ప్రింగర్ తలో రెండు వికెట్లు పడగొట్టగా, కీమో పాల్, గుడాకేశ్ మోతీకి చెరో వికెట్ దక్కింది. అయితే, విండీస్ బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు.

దీపావళి కానుకగా 'రామాయణం: పార్ట్ 1'.. రిలీజ్ డేట్ ఇదే!





భారత సినీ చరిత్రలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణం: పార్ట్ 1'. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, కన్నడ రాకింగ్ స్టార్ యశ్ రావణుడిగా నటిస్తున్న ఈ చిత్రం 2026 నవంబర్ 5న దీపావళి పండుగకు ముందుగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నవరాత్రుల శుభ సందర్భంగా ఈ ప్రకటన చేస్తూ, చిత్రంలోని ప్రధాన తారాగణంతో కూడిన ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఆదివారం నాడు చిత్ర నిర్మాణ సంస్థలు తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ విషయాన్ని వెల్లడించాయి. "ఇది రాముని యుగానికి ఆరంభం" అనే సందేశంతో ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టర్‌లో రాముడిగా రణ్‌బీర్, సీతగా సాయిపల్లవి, లక్ష్మణుడిగా రవి దూబే, రావణుడిగా యశ్ కనిపించారు. దసరా పండుగ నుంచి సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ కూడా ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. 'దంగల్' ఫేమ్ నితేష్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ రామాయణ గాథను రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, యశ్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మొదటి భాగం 2026లో రానుండగా, 'రామాయణం: పార్ట్ 2'ను 2027 దీపావళికి విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ చిత్రాన్ని హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నారు. భారతీయ పురాణానికి ఆధునిక సాంకేతికతను జోడించి, భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 8 సార్లు ఆస్కార్ అవార్డు గెలుచుకున్న డీఎన్ఈజీ సంస్థ దీనికి విజువల్ ఎఫెక్ట్స్ అందిస్తుండటం విశేషం. ఏ.ఆర్. రెహమాన్‌తో పాటు హాలీవుడ్ లెజెండరీ కంపోజర్ హాన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. సోనీ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేయనుండగా, హిందీ మార్కెట్‌లో ధర్మ ప్రొడక్షన్స్ విడుదల చేయనుంది. ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించేందుకు ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.



'పిక్చర్ అభీ బాకీ హై'.. వెన్నెముక గాయం తర్వాత నుస్రత్ తొలి పోస్ట్

బాలీవుడ్ నటి నుస్రత్ భరుచా ఇటీవల బాలి పర్యటనలో వెన్నెముక గాయానికి గురైన విషయం తెలిసిందే. శస్త్రచికిత్స అనంతరం ప్రస్తుతం కోలుకుంటున్న ఆమె, తాజాగా సోషల్ మీడియా వేదికగా తొలిసారి స్పందించింది. శనివారం తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఒక భావోద్వేగపూరిత పోస్ట్‌ను పంచుకుంది.కిటికీ గుండా కనిపిస్తున్న సూర్యాస్తమయం నేపథ్యంలో, ఖాళీగా ఉన్న వీల్‌చైర్ ఫొటోను ఆమె షేర్ చేసింది. దానికి "ఎప్పటి నుంచో సూర్యాస్తమయాలను చూస్తూనే ఉన్నాను.. కానీ ఒక్కసారిగా నా వీక్షణ మారిపోయింది. అయితే, పిక్చర్ అభీ బాకీ హై మేరే దోస్త్ (కథ ఇంకా మిగిలే ఉంది మిత్రమా)" అని క్యాప్షన్ జోడించింది. ఈ పోస్ట్ ద్వారా తన ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూనే, భవిష్యత్తుపై ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది.వృత్తిపరమైన పనులతో పాటు విహార యాత్ర కోసం నుస్రత్ బాలికి వెళ్ళిన సందర్భంలో అక్కడ జరిగిన ఒక ప్రమాదంలో ఆమె వెన్నెముకకు తీవ్ర గాయమైంది. మెరుగైన వైద్యం కోసం ఆమెను ప్రత్యేక విమానంలో ముంబైకి తరలించి శస్త్రచికిత్స నిర్వహించారు.ప్రస్తుతం ఆమె తన ఆరోగ్యంపైనే పూర్తి దృష్టి సారించారని, రాబోయే కొన్ని వారాల పాటు వృత్తిపరమైన బాధ్యతలకు విరామం ఇస్తున్నట్లు ఆమె ప్రతినిధి గతంలో ఒక ప్రకటన విడుదల చేశారు. నుస్రత్ కోలుకుంటున్న క్రమంలో ఆమె వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని కూడా కోరారు. ప్రస్తుతం నుస్రత్ ముంబైలోనే చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకుంటోంది.

రణబాలి' చూశాక మన చరిత్ర గురించి మాట్లాడుకుంటారు: విజయ్ దేవరకొండ

"'రణబాలి' కేవలం ఒక సినిమా కాదు, మన చరిత్రలో మరుగున పడిపోయిన ఒక ముఖ్యమైన అధ్యాయం. ఇది మన పూర్వీకులు పడిన కష్టాల కథ. ఈ సినిమా చూశాక ప్రతి ఒక్కరూ మన సంస్కృతి, మన చరిత్ర గురించి మాట్లాడుకుంటారు. ఇది ఒక గొప్ప సినిమాటిక్ అనుభూతిని, ఎమోషనల్ హైని ఇస్తుంది" అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. ఆయన కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ పాన్ ఇండియా చిత్రం "రణబాలి". రష్మిక మందన్న కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం విజయదశమి కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మీడియాతో మాట్లాడి సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.బ్రిటిషర్ల దోపిడీ, 80 లక్షల మంది మరణాలుఈ సినిమా వెనుక ఉన్న చారిత్రక నేపథ్యాన్ని విజయ్ దేవరకొండ భావోద్వేగంతో వివరించారు. "చాలామంది ఇప్పటికీ బ్రిటిష్ వాళ్లు మన మంచికోసమే రైల్వే లైన్లు వేశారని అనుకుంటారు. కానీ అది నిజం కాదు. మన దేశ సంపదను, ధాన్యాన్ని, పత్తిని నౌకాశ్రయాలకు తరలించి దోచుకోవడానికే వాళ్లు ఆ పనులు చేశారు. 1876-78 మధ్య కేవలం మద్రాస్ ప్రెసిడెన్సీలో వచ్చిన కరవు వల్లే 80 లక్షల మందికి పైగా ప్రజలు ఆకలితో చనిపోయారు. కరవు వస్తే మన రాజులు పన్నులు తగ్గించేవారు, కానీ బ్రిటిషర్లు మాత్రం రెట్టింపు పన్నులు వసూలు చేశారు. కట్టలేని వాళ్లను బానిసలుగా మార్చి రైల్వే లైన్లు, ప్రాజెక్టుల నిర్మాణంలో కఠోరమైన పనులు చేయించారు. పనిచేయలేని వాళ్లకు ఆకలి చావే గతి. ఈ నిజాలు తెలుసుకుంటే మనసు వికలమవుతుంది" అని అన్నారు. ఇలాంటి చారిత్రక తప్పిదాలు భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే మన గతాన్ని తెలుసుకోవడం చాలా ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు.



PRINTED ,PUBLISHED ,OWNED BY TEHELKA MEDIA NETWORK ,DIGITAL NEWS .Regd no:2019/28814, EDITOR :K.CHANDRA SHEKHAR, EXECUTIVE EDITOR :K.SRINIVAS RAO, G6 MES Colony, Alwal , Secunderabad -500010.e-mail:Tehelkamedianetworks@gmail.com